





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 301 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : కాకినాడ సోమవారం 7 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :301 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA MON 7 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## నేడు నెల్లూరులో మంత్రి లోకేశ్ పర్యటన..

- ప్రసిద్ధ బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు హాజరు
- వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను ప్రారంభించనున్న లోకేశ్
- నెల్లూరు సిటీ నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలతో బిజీబిజీగా మంత్రి



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన నెల్లూరు నగరంలో జరిగే ప్రసిద్ధ బారాషహీద్ దర్గా రొట్టెల పండుగలో పాల్గొననున్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన

వివరాలు 2లో..



### నాకు ఒక్క రోజు హోంమినిస్టర్ పదవి ఇస్తే రెడ్ బుక్ కాదు...

# అంతా బ్లడ్ బుక్కే!

- అమెరికాలో తానా 24వ మహాసభలు
- హాజరైన రఘురామ
- ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్

పెన్ పవర్ డెస్క్:అమెరికాలో నిర్వహించిన తానా 24వ ద్వైవార్షిక మహాసభల్లో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక్కరోజు గనుక మిమ్మల్ని రాష్ట్ర మంత్రిగా చేస్తే మీరు ఏ శాఖలు కోరుకుంటారు? అని కార్యక్రమ యాంకర్ మూర్తి ప్రశ్నించారు. అందుకు రఘురామ బదులిస్తూ, రోజులో 8 గంటలు తనను మంత్రిగా చేస్తే 6 గంటలు హోంమంత్రిగా, మిగతా 2 గంటలు వైద్య ఆరోగ్య మంత్రిగా పనిచేస్తానని అన్నారు.
మీరు హోంమంత్రి అయితే రెడ్ బుక్ అమలు చేస్తారా అని యాంకర్ మూర్తి అడగ్గా... తన వద్ద రెడ్ బుక్ ఉండదని, అది వేరే వాళ్ల వద్ద ఉందని రఘురామ బదులిచ్చారు. అయితే, తనదగ్గర బ్లడ్ బుక్ ఉందని స్పష్టం చేశారు. గతంలో తనపై జరిగిన అరాచకాల తాలూకు రక్తపు చారలు తనకు ఇంకా గుర్తున్నాయని రఘురామ అన్నారు. ఆ విధంగా తాను బ్లడ్ బుక్ తో ముందుకెళతానని తెలిపారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది.

## పొన్నూరు దాడి ఘటనపై వైసీపీ రాజకీయ కుట్ర

- ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీయడమే వారి లక్ష్యం
- దాడి రోజు కాపు కాసిన వైసీపీ వర్గీయులు
- టీడీపీ నేతలు బాబురావు, అశోక్‌పై దాడికి పన్నాగం
- పోలీసుల మాట కాదని ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు
- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర సంచలన ఆరోపణలు



పెన్ పవర్ డెస్క్:పొన్నూరులో జరిగిన దాడి ఘటనను వైసీపీ ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వంపై బురద చల్లి, అప్రతిష్ఠ పాలు చేసేందుకే వైసీపీ ఈ విధంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ ఘటన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని నరేంద్ర అన్నారు. దాడికి గురైన నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిన రోజు, ఆ ప్రాంతంలో వైసీపీ కార్యకర్తలు కాపు కాశారని ఆయన ఆరోపించారు. నిజానికి టీడీపీ నేతలు బండ్లమూడి బాబురావు, అశోక్‌లపై దాడి చేయడమే వారి అసలు ప్రణాళిక అని, ఈ మేరకు వైసీపీ వర్గీయులు కుట్ర పన్నారని తెలిపారు.దాడి జరిగిన తర్వాత గాయపడిన వ్యక్తిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని పోలీసులు ప్రయత్నించారని, అయితే వైసీపీ నేతలు కావాలనే అడ్డుపడి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారని ధూళిపాళ్ల వివరించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకుని లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే వైసీపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు.

### మాజీ సీజేఐ చంద్రచూడ్

## అధికారిక నివాసాన్ని వెంటనే ఖాళీ చేయించండి

- మాజీ సీజేఐ బంగ్లా వివాదం.. ఖాళీ చేయించాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు లేఖ
- పదవీ విరమణ తర్వాత గడువు ముగిసినా నివాసం వీడని వైనం
- ప్రత్యేక అవసరాలున్న కుమార్తెల వల్లే ఆలస్యమైందని చంద్రచూడ్ వివరణ
- ప్రత్యామ్నాయ వసతి సిద్ధమవగానే మారిపోతానని స్పష్టీకరణ




పెన్ పవర్ డెస్క్:భారత న్యాయవ్యవస్థలో మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, పదవీ విరమణ తర్వాత కూడా అధికా రిక నివాసాన్ని ఖాళీ చేయకపోవడంతో

వివరాలు 2లో..

## పాశమైలారం పేలుడు ఘటన..

# 41కి చేరిన మృతుల సంఖ్య

- పాశమైలారం సిగాచీ పేలుడు ఘటనలో పెరిగిన మృతుల సంఖ్య
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి
- మృతుల సంఖ్య 41కి చేరినట్లు అధికారుల వెల్లడి
- ఇప్పటి వరకు లభ్యం కాని 9 మంది ఆచూకీ
- కొనసాగుతున్న శిథిలాల తొలగింపు పనులు



పెన్ పవర్ డెస్క్:సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమ లో జరిగిన ఘోర అగ్నిప్రమాద ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య 41కి చేరినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిణామం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జితేందర్ అనే వ్యక్తి ఆదివారం మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగింది. మరోవైపు, శిథిలాల కింద లభించిన

వివరాలు 2లో..

## సుపరిపాలనలో తొలి అడుగు... కూటమి ప్రభుత్వ ఘనతలను ప్రజలకు వివరించిన మంత్రి ఆనం

- ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పర్యటన
- సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం
- ప్రభుత్వ తొలి ఏడాది సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న మంత్రి
- సూపర్ సిక్స్ హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ
- అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి హామీల అమలు త్వరలోనేనని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయా ణం, ఆడబిడ్డ నిధి వంటి కీలక హామీలను కూడా నెరవేరుస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనా రాయణ రెడ్డి స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## హిమాచల్‌లో ఆగని వర్ష బీభత్సం.. 75 మంది మృతి.. రెడ్ అలర్ట్ జారీ

- హిమాచల్ ప్రదేశ్‌ను ముంచెత్తుతున్న భారీ వర్షాలు
- ఒక్క మండి జిల్లాలోనే 75 మంది మృత్యువాత
- రాష్ట్రవ్యాప్తంగా 240కి పైగా రహదారులు మూసివేత
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ
- సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఐటీబీపీ బృందాలు



పెన్ పవర్ డెస్క్:హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి ప్రకోపా నికి మండి జిల్లాలో మృతుల సంఖ్య 75కు చేరడం తీవ్ర విషాదాన్ని నింపింది. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వానల కారణంగా కొండ చరియలు విరిగిపడుతుండగా, మెరుపు వరదలతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ విపత్తు కారణంగా రాష్ట్రంలో 240కి పైగా రహదారులు

వివరాలు 2లో..

## దలైలామా భారత్ లో ఉండడం మా అదృష్టం

- ధర్మశాలలో దలైలామా 90వ పుట్టినరోజు వేడుకలు
- పాల్గొన్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- వారసుడి ఎంపికపై చైనాకు భారత్ గట్టి హెచ్చరిక
- దలైలామా సంస్థ నిర్ణయానికే కట్టుబడి ఉంటామని స్పష్టీకరణ
- తమ ఆమోదంతోనే ఎంపిక జరగాలంటున్న చైనా
- బయటి జోక్యాన్ని తిరస్కరించిన దలైలామా

పెన్ పవర్ డెస్క్:టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో చైనాకు భారత్ గట్టిగా బదులిచ్చింది. ఈ విష యంలో బయటి శక్తుల జోక్యాన్ని సహిం చేది లేదని, దలైలామా సంస్థ తీసుకునే నిర్ణయానికే తమ పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

వివరాలు 2లో..



## సిద్ధరామయ్య క్షమాపణలు చెప్పాల్సిందే

- హాసన్ జిల్లా మరణాలకు కొవిడ్ టీకాలే కారణమని సీఎం అనుమానం
- దర్యాప్తులో టీకాలకు, మరణాలకు సంబంధం లేదని తేల్చిన నిపుణులు
- సీఎం సిద్ధరామయ్య ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్
- సీఎం వ్యాఖ్యలు బాధ్యతారహితమన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- మోదీపై అక్కసుతోనే కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తోందని విమర్శ
- మేడిన్ ఇండియా వ్యాక్సిన్లను అప్రతిష్టపాలు చేసే కుట్ర అని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:కొవిడ్ టీకాల వల్లే గుండెపోటు మరణాలు సంభవిస్తున్నా యం టూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం

వివరాలు 2లో..

## బ్రెజిల్‌లో మోదీకి ఆధ్యాత్మిక స్వాగతం..

### గణేశ మంత్రంతో స్వాగతం పలికిన కళాకారులు



పెన్ పవర్ డెస్క్:బ్రిక్స్ దేశాల 17వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బ్రెజిల్ వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి అక్కడ ఒక అపూర్వ, ఆధ్యాత్మిక స్వాగతం లభించింది. రియో డి జనీరో నగరంలో విమానం దిగిన ప్రధానికి, స్థానిక సంగీత కళాకారులు

వివరాలు 2లో..

- బ్రిక్స్ సదస్సు కోసం బ్రెజిల్ చేరుకున్న ప్రధాని మోదీ
- రియోలో 'ఓం గం గణపతయే నమః' మంత్రంతో ఘన స్వాగతం
- స్థానిక కళాకారుల ప్రదర్శనకు ప్రధాని మోదీ ముగ్ధులు
- ప్రతి కళాకారుడినీ అభినందించిన ప్రధాని
- మోదీని కలవడం జీవితంలో మర్చిపోలేమన్న కళాకారులు
- నాలుగు రోజుల పాటు బ్రెజిల్‌లో కొనసాగనున్న ప్రధాని పర్యటన

## ఎడిటర్ వ్యూ

# గుండె ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తే.. తీరని నష్టం తప్పదు

మై హార్ట్ ఈజ్ బీటింగ్.. అదోలా..ఈ పాట గుర్తుందా.. ఇది ప్రేమలో ఉన్న యూత్?కి కనెక్ట్? అయ్యేలా రాశారు. అందరూ అలానే ఆస్వాదించారు కూడా. అయితే కొన్ని సందర్భాల్లోఈ లిరిక్?ని వాడితే.. 'ఏమయిందో కాస్తచూపించుకోరా..' అంటూ ఫ్రెండ్స్ తమాషా పట్టిస్తుంటారు. అయితే అదే ఇప్పుడు నిజమవుతుంది అంటే నమ్ముతారా? యంగ్?ఏజ్?లో ఉన్నా.. హెల్త్ విషయంలో ఏదైనా అనుమానించదగ్గ సమస్య అనిపిస్తే.. కచ్చితంగా చెకప్ చేయించుకోవాల్సిందే'అంటున్నారు ఎక్స్‌పర్ట్స్.

మొన్నటికి మొన్న జూన్ 28న.. ప్రముఖ నటి, మోడల్, బిగ్?బాస్ ఫేం షెఫాలీ జరివాలా 42 ఏండ్ల వయసులో గుండెపోటుతో మరణించింది. ఈ సంఘటనకు ముందు.. వ్యాపార వేత్త సంజయ్ కపూర్ జూన్ 13న, 53 ఏండ్ల వయసులో గుండెపోటుకు గురయ్యారు. అలాగే గతంలో 46 ఏండ్లలో పునీత్ రాజ్ కపూర్, 40 ఏండ్లకు సిద్ధార్థ్? శుక్లా, 35 ఏండ్ల వయసులో చిరంజీవి సర్జా.. ఇలా ఎంతోమంది ఫేమస్ సెలబ్రెటీలు గుండె పోటు వల్ల మరణించారు. ఈ వార్తలు చదవడానికి, వినడానికి, చూడడానికి భయాందోళనలు కలిగిస్తున్నప్పటికీ.. ఇవి వాస్తవాలు. అయితే వీళ్లు సెలబ్రెటీలు కాబట్టి వాళ్ల గురించి ఎక్కువగా మాట్లాడుకుంటున్నాం. ఇంత చిన్న వయసులో ఎందుకిలా జరిగింది? అంటూ ఆరా తీస్తున్నాం. కానీ సామాన్యుల్లోనూ క్రికెట్ ఆడుతూ ఒకరు, జిమ్ చేస్తూ మరొకరు, రన్నింగ్ చేస్తూ.. ఇలా సడెన్?గా చనిపోయిన వార్తలు కూడా చూశాం. ఇన్ని తెలిసినా అదొక వార్తగా చదివి పక్కన పెట్టడం కరెక్ట్ కాదు. సమస్య చిన్నదైనా ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు.కర్నాటకలో ఈ మధ్య కాలంలో గుండె పోటు కేసులు వెంటవెంటనే నమోదయ్యాయి. అలా సడెన్? డెత్ అయినవాళ్లలో చాలామంది యంగ్ ఏజ్ వాళ్లు ఉండడం ఆందోళనకరంగా మారింది. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసుల గురించి లోతుగా స్టడీ చేయాలని ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. అయితే అసలు గుండె సమస్యల గురించి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్? అమరేశ్? రావు మాటల్లో..

గుప్పెడు గుండె.. మన శరీరమంతా సజావుగా రక్త ప్రసరణ చేస్తుంది. అలాంటి గుండె ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తే.. తీరని నష్టం తప్పదు. రీసెంట్?గా 20 %-% 40 ఏజ్ గ్రూప్?లో ఎక్కువగా హార్ట్ ఎటాక్? కేసులు వస్తున్నట్టు తెలుస్తోంది. పక్క రాష్ట్రంలో ఇది కొవిడ్ వ్యాక్సిన్ వల్లేనని ప్రచారం జరుగుతోంది. కానీ.. అందులో నిజం లేదని తేలింది. అయితే ముఖ్యంగా ఇప్పుడు వస్తున్న కేసులు చూస్తే లైఫ్ స్టయిల్? మీద ఆధారపడి ఉన్నాయి. కొవిడ్ తర్వాత లైఫ్ స్టయిల్?లో చాలా మార్పులు వచ్చాయి. వాటిలో పాజిటివ్?గా చెప్పుకోవాల్సింది చాలామంది హెల్త్ మీద ఫోకస్ చేస్తున్నారు. మరి నెగెటివ్? ఏంటి అంటే.. కొవిడ్ తర్వాత చాలామంది స్మోకింగ్, డ్రింకింగ్, డ్రగ్స్ వంటి దురలవాట్లకు బానిసలయ్యారు. అలాగే బయటి ఫుడ్?, ప్రాసెస్డ్? ఫుడ్? ఆర్డర్ పెట్టుకుని తినడానికి అలవాటు పడిపోయారు. ఎక్సర్?సైజ్ చేయనివాళ్లు ఎక్కువ శాతం వీటికి అలవాటు పడినట్లు తెలుస్తోంది.

**మత్తు వదలకపోతే..**

మరీ ముఖ్యంగా కొవిడ్ తర్వాత చాలామంది కొకైన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. అందులో కొంతమంది 'జిమ్?కి వెళ్తున్నాం.. ఎక్సర్?సైజ్ చేస్తున్నాం.. డైట్ పాటిస్తున్నాం.. మాకేం కాదు..' అనుకుంటున్నారు. కానీ, మార్నింగ్ జిమ్ చేసి నైట్ కొకైన్ తీసుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. మత్తు పదార్థాలు కచ్చితంగా హార్ట్ ఎటాక్‌కు గురయ్యేలా చేస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉంటేనే మంచిది.

అన్ని హెల్దీ హ్యాబిట్స్ ఉన్నా.. ఒక్క డ్రగ్స్ అలవాటు మానుకోకపోతే మాత్రం సడెన్ కార్డియాక్ అరెస్ట్‌కు నూటికి నూరు శాతం ఆస్కారం ఉంది అని పలు స్టడీల్లో, కేసుల్లోనూ తేలింది. అలాగే జిమ్‌కి వెళ్లి అన్‌హెల్దీ డైట్ పాటిస్తున్నా.. యంగ్‌గా కనపడడానికి డాక్టర్ సూచించని మందులు వాడడం వల్ల కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కొవిడ్‌కుముందే..

కొవిడ్‌కు ముందే నిమ్స్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్‌తో కలిసి హార్ట్ ఎటాక్‌లపై రీసెర్చ్ చేశాం. దాంట్లో తేలింది ఏంటంటే.. 40 ఏండ్ల లోపు ఉన్న పేషెంట్స్ అందులో ఆల్రెడీ స్టంట్ వేయించుకున్నవాళ్లు, హార్ట్‌లో హోల్ ఉన్నవాళ్లను స్టడీ చేశాం. ఇండియాలో ఈ పర్టిక్యులర్ ఏజ్ గ్రూప్‌లోనే హార్ట్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. ఆ స్టడీలో చాలా తక్కువ మందికి డయాబెటిస్, ఒబెసిటీ, స్మోకింగ్, బీపీ చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. జన్యుపరంగా లేదా వంశపారంపర్యంగా ఎక్కువ వచ్చేందుకు అవకాశం ఉన్నట్టు తెలిసింది. కానీ పూర్తిస్థాయిలో ఇంకా స్పష్టత లేదు.

అయితే ఒక అమెరికన్ కార్డియాలజిస్ట్.. కూడా దీనిపై రీసెర్చ్ చేయాలని మొదట ఇండియన్ ఆరిజిన్ డాక్టర్స్?ని స్టడీ చేశారు. ఆ రీసెర్చ్?లో విదేశీయుల?తో పోలిస్తే.. ఇండియన్స్?లో సాధారణంగానే రక్తనాళాలు సన్నగా ఉంటాయని, అందువల్ల మనవాళ్లు ఎక్కువగా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నట్టు ఆయన తేల్చారు. వాస్తవంగా మన దేశంలో గుండె సంబంధిత వ్యాధులు, డయాబెటిస్ వంటివి ఎక్కువ. జన్యుపరంగా వచ్చేవి కూడా ఉంటాయి. కాబట్టి ఇవి గుండె సమస్యలకు దారి తీసేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

**నిర్లక్ష్యం ఖరీదు..**

యంగ్ ఏజ్‌లో ఏ ప్రాబ్లమ్ వచ్చినా బాడీ దాన్ని అధిగమించగలుగుతుంది. ఏమాత్రం హెల్త్ ఇష్యూస్ ఉన్నా.. నిర్లక్ష్యం చేయకూడదు. చిన్నప్పుడు ఫిట్స్ వచ్చింది.. ఆ తర్వాత రాలేదు కదా అని కొందరు. ఆస్తమా పెద్దయ్యాక లేదు కదా అని మరికొందరు. తినకపోవడం వల్ల కళ్లు తిరిగాయి.. తింటే సెట్ అవుతుందని, అప్పుడప్పుడు వచ్చే తలనొప్పే పెద్దగా పట్టించుకో నక్కర్లేదని అనుకుంటారు. అలాగే, ఎక్కువగా ఆయాస పడడం, ఇంతకుముందు చేసిన పని ఇప్పుడు చేయలేకపోవడం, అనూహ్యంగా బరువు పెరగడం లేదా తగ్గడం వంటి కొన్ని సమస్యలను చిన్నవే అనుకుని పెద్దగా పట్టించుకోరు. ఆ తర్వాత మళ్లీ ఏదైనా ప్రాబ్లమ్ వస్తుందా? లేక అది దీర్ఘకాలిక సమస్యకు సంకేతమా? అని ఆలోచించలే కపో తున్నారు. 'సమస్య చిన్నదే కదా' అని నిర్లక్ష్యం చేయకూడదు. అలాంటి వాటిని నిర్లక్ష్యం చేస్తే.. ముమ్ముందు దేనికైనా దారితీయొచ్చు. కాబట్టి బేసిక్ చెకప్?లు చేయించుకోవడం తప్పనిసరి. హార్ట్, బ్రెయిన్?కి సంబంధించిన సమస్యలను వెంటనే టెస్ట్ చేయించుకోవాలి. అప్పుడే ఎలాంటి ఇబ్బందులు లేకుండా లైఫ్? హ్యాపీగా లీడ్ చేయొచ్చు.

**సడెన్ డెత్‌లకు కారణం**

ప్రతి సడెన్ డెత్.. కార్డియాక్ డెత్ కాదు.. గుండెలో కొలెస్ట్రాల్ బ్లాకేజీ ఉండడం వల్ల కావొచ్చు. కొన్ని గుర్తించలేని వ్యాధులు లేదా అనారోగ్య సమస్యల వల్ల కూడా ఇలా జరగొచ్చు. కొన్ని పరిస్థితుల్లో రక్తనాళాలు చీలిపోవడం, గుండెలో రంధ్రం ఉన్నా గుర్తించకపోవడం, గుండె జబ్బు ముదిరిపోవడం వంటి కండిషన్స్?లో సడెన్ డెత్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

**బేసిక్ టెస్ట్ అవసరం**

ఈ మధ్య ప్రభుత్వం చొరవతో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ వంటివి చేస్తున్నారు. ఉద్యోగాల్లో చేరే ముందు ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం తప్పకుండా టెస్ట్?లు చేయించుకోవాలి. ఇప్పుడు నిజాం ఇనిస్టిట్యూట్?లో కూడా స్టూడెంట్స్?ని జాయిన్ ?చేసుకునే ముందు వాళ్లకు స్క్రీనింగ్ జరుగుతుంది. తద్వారా ఏదైనా అనారోగ్య సమస్య ఉన్నట్లయితే వెంటనే దాన్ని పరిష్కరించొచ్చు. అయితే చాలామంది ఏంటంటే.. టెస్ట్? చేస్తే ఏదో ఒక సమస్య ఉందని చెప్తారు అని భయపడిపోతుంటారు. అలాకాకుండా బేసిక్ ఫిట్?నెస్ టెస్ట్ చేయించుకోవడం వల్ల చాలా వరకు వ్యాధులను పసిగట్టొచ్చు.

**ఆరోగ్యంగా ఉండడమంటే..**

'ఎక్సర్‌సైజ్, డైట్ చేస్తే చాలు.. ఆరోగ్యంగా ఉంటాం' అనుకుంటే పొరపాటు. అవి రెండే సరిపోవు.. మరికొన్ని అంశాలు కూడా బాగుండాలి. అవేంటంటే.. ఒత్తిడి లేకుండా ఉండాలి. మనశ్శాంతి, సంతోషం, సంతృప్తి, లైఫ్ వ్యాల్యూస్ తెలుసుకోవడం, ఫ్యామిలీ, ఫ్రెండ్స్ సపోర్ట్ వంటివన్నీ ఉంటేనే ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండగలడు. – డాక్టర్ అమరేశ్ రావు మాలెంపాటి(ప్రొఫెసర్ అండ్ హెడ్? డిపార్ట్?మెంట్ ఆఫ్? కార్డియో థొరాసిక్ సర్జరీ, నిమ్స్, హైదరాబాద్?

# మాజీ సీజేఐ చంద్రచూడ్ అధికారిక నివాసాన్ని వెంటనే ఖాళీ చేయించండి

- మొదటి పేజీ తరువాయి

సుప్రీం కోర్టు యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. గడువు ముగిసినా ఆయన ఇంకా అక్కడే ఉంటున్నారని, ఆ బంగ్లాను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాసింది. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీలోని కృష్ణా మీనన్ మార్గ్‌లో ఉన్న 5వ నంబర్ బంగ్లాను భారత ప్రధాన న్యాయమూర్తికి కేటాయిస్తారు. 2024 నవంబర్‌లో పదవీ విరమణ చేసిన జస్టిస్ చంద్రచూడ్, ఇప్పటికీ అదే బంగ్లాలో నివాసం ఉంటున్నారు. నిబంధనల ప్రకారం పదవీ విరమణ తర్వాత ఆరు నెలల గడువు ఈ ఏడాది మే 10తోనే ముగిసింది. ప్రత్యేక అనుమతితో మే 31 వరకు పొడిగించినా ఆయన బంగ్లాను ఖాళీ చేయలేదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు యంత్రాంగం జులై 1న కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. "జస్టిస్ చంద్రచూడ్ నుంచి బంగ్లాను తక్షణమే స్వాధీనం చేసుకోండి. ఆయనకు ఇచ్చిన అనుమతి గడువు ముగిసింది" అని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొంది.ఈ వివాదంపై జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. తప్పనిసరి వ్యక్తిగత కారణాల వల్లే ఆలస్యమైందని, ఈ విషయం సుప్రీంకోర్టు యంత్రాంగానికి కూడా తెలుసని ఆయన వివరించారు. "నాకు ప్రత్యేక అవసరాలున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి (నెమాలిన్ మయోపతి) కారణంగా వారికి అనువైన ఇల్లు చూసుకోవడానికి కొంత సమయం పట్టింది. ప్రభుత్వం నాకు ప్రత్యామ్నాయ వసతి కేటాయించింది. కానీ ఆ ఇల్లు చాలాకాలంగా మూసి ఉండటంతో మరమ్మతులు జరుగుతున్నాయి. అవి పూర్తయిన మరుక్షణమే నేను మారిపోతాను" అని ఆయన తెలిపారు.తాను అత్యున్నత పదవిలో పనిచేశానని, తన బాధ్యతలు తనకు పూర్తిగా తెలుసని జస్టిస్ చంద్రచూడ్ స్పష్టం చేశారు. మరికొన్ని రోజుల్లోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని ఆయన హామీ ఇచ్చారు. అయితే, సుప్రీంకోర్టు పరిపాలన విభాగం స్వయంగా ఒక మాజీ సీజేఐ నివాసం ఖాళీ చేయించడం కోసం ప్రభుత్వానికి లేఖ రాయడం మాత్రం ఇదే ప్రథమం కావడంతో ఈ విషయం ప్రాధాన్యత సంతరించుకుంది.

# హిమాచల్‌లో ఆగని వర్ష బీభత్సం.. 75 మంది మృతి.. రెడ్ అలర్ట్ జారీ

- మొదటి పేజీ తరువాయి

పూర్తిగా మూతపడ్డాయి. వాటిలో అత్యధికంగా 176 రోడ్లు ఒక్క మండి జిల్లాలోనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భారీ వర్షాలతో సహాయక చర్యలకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఒక్క రోజులోనే 115 నుంచి 204 మిల్లీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా, వాతావరణ శాఖ రానున్న 24 గంటలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. కంగ్రా, సిర్మూర్, మండి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. చంబా, కంగ్రా, శిమ్లా, సిర్మూర్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించవచ్చని హెచ్చరించింది. మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసి, బలహీనమైన కట్టడాల్లో నివసించవద్దని ప్రజలను కోరింది.ప్రస్తుతం ఐటీబీపీ దళాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) సహకారం కూడా తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ప్రభుత్వానికి సూచించారు.

# నేడు నెల్లూరులో మంత్రి లోకేశ్ పర్యటన..

- మొదటి పేజీ తరువాయి

ఈ వేడుకకు హాజరుకానుండటంతో పార్టీ వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి.అధికారికంగా విడుదలైన పర్యటన వివరాల ప్రకారం, మంత్రి లోకేశ్ సోమవారం ఉదయం తన పర్యటనను ప్రారంభిస్తారు. ఉదయం 9 గంటలకు నెల్లూరు నగరంలోని వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన ప్రారంభిస్తారు. అనంతరం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చెందిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో, ఆ తర్వాత సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ కార్యక్రమంలో పాల్గొని, తన పర్యటనను ముగిస్తారు.

# సుపరిపాలనలో తొలి అడుగు... కూటమి ప్రభుత్వ ఘనతలను ప్రజలకు వివరించిన మంత్రి ఆనం

- మొదటి పేజీ తరువాయి

ఆత్మకూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే తన ఏకైక లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆనం తన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆదివారం సంగం మండలం కోలగట్ల గ్రామంలో ఆయన పర్యటించి, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు. తమ ప్రభుత్వ తొలి ఏడాది పాలనలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను, ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వారికి వివరించారు. సుపరిపాలన అంటే ఏమిటో తమ ప్రభుత్వం చేతల్లో చూపిస్తోందని అన్నారు.

మంత్రి నిన్న కుప్పూరుపాడు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంకు పార్టీ శ్రేణులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ పర్యటన ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు.

# పాశమైలారం పేలుడు ఘటన.. 41కి చేరిన మృతుల సంఖ్య

- మొదటి పేజీ తరువాయి

మరో మృతదేహం వివరాలను అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదంలో గల్లంతైన మరో తొమ్మిది మంది ఆచూకీ ఇప్పటికీ లభించకపోవడం కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పేలుడు ధాటికి కుప్పకూలిన భవన శిథిలాలను తొలగించే పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. తమ వారి జాడ తెలియకపోవడంతో కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

# దలైలామా భారత్ లో ఉండడం మా అదృష్టం

- మొదటి పేజీ తరువాయి

హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఆదివారం జరిగిన దలైలామా 90వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

దలైలామా వారసుడిని బీజింగ్ ఆమోదించిన పద్ధతుల ప్రకారమే ఎంపిక చేయాలని, టిబెట్ సంబంధిత విషయాల్లో భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలని ఇటీవల చైనా విదేశాంగ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కిరణ్ రిజిజు చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చారు. "దలైలామా సంస్థ, దాని సంప్రదాయాలు, కట్టుబాట్ల ప్రకారం తీసుకునే ఏ నిర్ణయానికైనా మేం పూర్తిగా కట్టుబడి ఉంటాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది భక్తుల తరఫున నేను ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాను" అని ఆయన అన్నారు.ఈ వేడుకల్లో రిజిజు మాట్లాడుతూ, "దలైలామా కేవలం ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు. ప్రాచీన విజ్ఞానానికి, ఆధునిక ప్రపంచానికి మధ్య ఆయనొక సజీవ వారధి" అని కొనియాడారు. 'ఆర్యభూమి'గా భావించే మన దేశంలో ఆయన ఉండటం మనందరికీ ఆశీర్వాదమని పేర్కొన్నారు.తన పుట్టినరోజు సందర్భంగా దలైలామా మాట్లాడుతూ, "మేం మా దేశాన్ని కోల్పోయి, భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నప్పటికీ.. ఇక్కడి నుంచే ఎంతో మందికి సేవ చేయగలుగుతున్నాను. నా శ???? మేరకు జీవులకు సేవ చేయాలన్నదే నా ఉద్దేశం" అని తెలిపారు. తన వారసుడిని, తాను స్థాపించిన భారత ఆధారిత 'గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్' ఎంపిక చేస్తుందని, ఇందులో బయటి శక్తుల జోక్యం ఉండదని దలైలామా ఇప్పటికే తేల్చిచెప్పడం గమనార్హం. షిమ్లా సమీపంలోని దోర్జిడాక్ మొనాస్టరీలో కూడా టిబెటన్ బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# కొనసాగుతున్న 'దలైలామా' వివాదం... మరోసారి చైనా నోట అదే మాట!

పునర్జన్మపై దలైలామాకు అధికారం లేదన్న చైనా

700 ఏళ్ల సంప్రదాయమని చైనా రాయబారి స్పష్టీకరణ

మతవిశ్వాసాల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసిన భారత్

నిర్ణయం తీసుకునే హక్కు దలైలామాదేనన్న కేంద్ర మంత్రి రిజిజు

ఇది సాంస్కృతిక మారణహోమమేనని టిబెట్ ప్రవాస ప్రభుత్వం ఆరోపణ



టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా పునర్జన్మ అంశంపై మరోసారి వివాదం రాజుకుంది. ఈ విషయంలో దలైలామాకు ఎలాంటి అధికారం లేదని, ఆయనే తుది నిర్ణయం తీసుకోలేరని భారత చైనా రాయబారి జు ఫెయిహాంగ్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా వైఖరిపై భారత ప్రభుత్వం, టిబెట్ ప్రవాస ప్రభుత్వం తీవ్రంగా స్పందించాయి.

టిబెటన్ బౌద్ధమతంలో 'లివింగ్ బుద్ధాల' పునర్జన్మ అనేది 700 ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఒక చారిత్రక, మతపరమైన సంప్రదాయమని జు ఫెయిహాంగ్ తన ఎక్స్ ఖాతాలో తెలిపారు. ఈ వ్యవస్థను కొనసాగించాలా వద్దా అని నిర్ణయించే అధికారం 14వ దలైలామాకు లేదని ఆయన స్పష్టం చేశారు. చైనా చట్టాలు, మతపరమైన ఆచారాల ప్రకారమే పునర్జన్మ ప్రక్రియ జరగాలని చైనా విదేశాంగ శాఖ కూడా గతంలోనే తేల్చిచెప్పింది.

చైనా వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం ఆచితూచి స్పందించింది. మత విశ్వాసాలు, నమ్మకాలకు సంబంధించిన విషయాల్లో తాము జోక్యం చేసుకోబోమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. అయితే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాత్రం దీనిపై భిన్నంగా స్పందించారు. దలైలామా పునర్జన్మ పూర్తిగా మతపరమైన అంశమని, దీనిపై నిర్ణయం తీసుకునే హక్కు కేవలం ఆయనకు, బౌద్ధ సంప్రదాయాలకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇతరుల జోక్యానికి తావు లేదని ఆయన అన్నారు.జూలై 6న దలైలామా 90వ పుట్టినరోజు జరుపుకుంటున్న తరుణంలో ఈ వివాదం మళ్లీ తెరపైకి రావడం గమనార్హం. ఇదిలా ఉండగా, చైనా చర్యలను టిబెట్ ప్రవాస ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. టిబెటన్ల గుర్తింపును చెరిపేసేందుకు చైనా "సాంస్కృతిక మారణహోమానికి" పాల్పడుతోందని ప్రవాస ప్రభుత్వ అధ్యక్షుడు పెన్పా త్సెరింగ్ ఆరోపించారు.

# సిద్ధరామయ్య క్షమాపణలు చెప్పాల్సిందే

- మొదటి పేజీ తరువాయి

రేపుతున్నాయి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడటం అత్యంత బాధ్యతారాహిత్యమని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీపై రాజకీయ అక్కసుతోనే 'మేడిన్ ఇండియా' వ్యాక్సిన్‌పై కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తోందని, ఇందుకుగాను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**అసలేం జరిగిందంటే..!**

కొద్ది రోజుల క్రితం కర్ణాటకలోని హాసన జిల్లాలో 20 మందికి పైగా గుండెపోటుతో మరణించిన ఘటన కలకలం రేపింది. ఈ మరణాలపై స్పందించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య.. వీటికి కొవిడ్ టీకాలే కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై లోతైన దర్యాప్తు జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించడమే కాకుండా, నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు.

**నివేదికతో బట్టబయలు**

ముఖ్యమంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన నిపుణుల కమిటీ, హాసన మరణాలపై సమగ్ర దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ మరణాలకు, కొవిడ్ టీకాలకు ఎలాంటి సంబంధం లేదని కమిటీ తన నివేదికలో స్పష్టంగా తేల్చిచెప్పింది. బాధితులలో జన్యుపరమైన, మానసిక, పర్యావరణ సంబంధిత సమస్యలే గుండెపోటుకు ప్రధాన కారణాలని పేర్కొంది. దీంతో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని తేలిపోవడంతో, ప్రతిపక్ష బీజేపీ ఆయనపై విమర్శల దాడిని ఎక్కుపెట్టింది.

**మోదీపై అక్కసుతోనే కుట్ర: బీజేపీ**

నిపుణుల కమిటీ నివేదిక అనంతరం హుబ్బళ్లిలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, సిద్ధరామయ్యపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మన శాస్త్రవేత్తలు ఎంతో శ్రమించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా 'మేడిన్ ఇండియా' వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు.

దాని ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుంది. ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి అత్యున్నత సంస్థలు ఎప్పుడో టీకాల భద్రతపై స్పష్టత ఇచ్చాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ కమిటీ కూడా అదే చెప్పింది. ఇప్పటికైనా సిద్ధరామయ్య తన తప్పును ఒప్పుకుని క్షమాపణ చెబుతారా?" అని నిలదీశారు.

బీజేపీ అధికార ప్రతినిధి అశ్వత్ నారాయణ్ సైతం సీఎం తీరును తప్పుబట్టారు. ఇది కేవలం సిద్ధరామయ్య వ్యాఖ్యలే కావని, ప్రధాని మోదీపై ద్వేషంతో 'మేడిన్ ఇండియా' ఉత్పత్తులను అప్రతిష్టపాలు చేసే కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. ఒక ముఖ్యమంత్రి తన సొంత ప్రభుత్వ కమిటీ నివేదికతోనే ఇరుకునపడటం సిగ్గుచేటని విమర్శించారు.

# బ్రెజిల్‌లో మోదీకి ఆధ్యాత్మిక స్వాగతం..

- మొదటి పేజీ తరువాయి

'ఓం గం గణపతయే నమః' అనే సంస్కృత గణేశ మంత్రాన్ని ఆలపించి ఘనంగా స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ సంగీతానికి బ్రెజిల్ సంగీత శైలిని జోడించి, అక్కడి గాయనీగాయకులు ఈ మంత్రాన్ని అద్భుతంగా ఆలపించారు. ఈ ప్రదర్శనను చూసి ప్రధాని మోదీ ఎంతో ముగ్ధులయ్యారు. ఆయన చేతులు జోడించి, చిరునవ్వుతో నిలుచుండిపోయారు. ఈ ఆధ్యాత్మిక స్వాగతం భారత సాంస్కృతిక వారసత్వం ప్రపంచవ్యాప్తంగా ఎంతగా విస్తరిస్తోందో తెలియజేసింది.

కార్యక్రమం ముగిశాక, ప్రధాని మోదీ స్వయంగా ఆ కళాకారులను కలిసి అభినందించారు. ప్రతి ఒక్కరితో కరచాలనం చేసి, వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "ప్రధాని మా ప్రదర్శనను ఇంతగా ఆస్వాదించడం మాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆయన మమ్మల్ని వ్యక్తిగతంగా కలవడం ఎప్పటికీ మరిచిపోలేం" అని కళాకారులు తమ సంతోషాన్ని పంచుకున్నారు.

ప్రధాని మోదీ బ్రెజిల్‌లో నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఆయన అర్జెంటీనా నుంచి ఇక్కడికి చేరుకున్నారు. రియోలో జరిగే బ్రిక్స్ సదస్సు అనంతరం, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా ఆహ్వానం మేరకు రాజధాని బ్రసీలియాలో పర్యటిస్తానని ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు కూడా సభ్యులుగా ఉన్న సంగతి తెలిసిందే.

# షార్ట్ సర్క్యూట్ తో తాటాకు ఇల్లు దగ్ధం



**కాజులూరు, పెన్ పవర్, జూలై 6 :** కాజులూరు మండలం కోలంక నామవారి వీధిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కొడగాల వెంకటేశ్వర్లు కు చెందిన తాటాకు ఇల్లు ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మంటలకు ఆహుతి అయింది.మంటలు చెలరేగిన వెంటనే స్థానికులు కాకినాడ ఫైర్ స్టేషన్ కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు చుట్టుపక్కల ఇతర ఇళ్లకు వ్యాపించకుండా సమర్థంగా అదుపు చేశారు. అయితే అప్పటికే వెంకటేశ్వర్లుకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయి, ఇంట్లో గల సామగ్రి పూర్తిగా తగలబడింది.ఇంట్లో వెంకటేశ్వర్లు తో పాటు ఆయన చిన్న కుమారుడు వీరబాబు నివాసం ఉంటున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో రెండు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు కాకినాడ జిల్లా సహాయ ఫైర్ అధికారి బి.ఏసుబాబు తెలిపారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు

# కాకినాడలో సుపరిపాలన ఇంటింటి ప్రచారం

## - మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం



**కాకినాడ, పెన్ పవర్, జూలై 6 :** "మాది ప్రజా ప్రభుత్వం.. ప్రజలే పాలకులు. సుపరిపాలనలో తొలి అడుగు-ఇది ప్రజా విజయం" అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కాకినాడరూరల్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ కు ప్రజలు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు.కాకినాడ ఇంద్రపాలెంలోని పల్లపు వీధి, రామాలయం, మెరక వీధి, కొత్తూరులో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు ఆధ్వర్యం వహించారు. మంత్రి సుభాష్ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు.అలాగేప్రజాభిప్రాయాలను సేకరించి 'మై టిడిపి' యాప్ లో నమోదు చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ఏడాది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం లో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అయినట్లు వివరించారు. 2014-19లో జరిగిన అభివృద్ధి, సంక్షేమం సరైన విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోవడం వల్ల 2019లో పార్టీకి నష్టం జరిగినట్లుగా గుర్తుచేశారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకుండా ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు.వైసీపీ హయంలో రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నా, ఇప్పుడు పారిశ్రామిక వేత్తలు విశ్వాసంతో రూ.9.34 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నారని, వీటి ద్వారా 8.5 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు పెట్టుబడులకు ముందుకు రావడం కూటమి ప్రభుత్వ ఘనత అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 64 లక్షల మందికి పింఛన్లు, తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల విద్యార్థులకు నగదు జమ, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు, డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసాకు రూ.250 కోట్లు, 204 అన్నా క్యాంటీన్లు, అర్చకులకు, నాయీ బ్రాహ్మ ణులకు, పాస్టర్లకు, ఇమామ్ మౌజన్లకు గౌరవ వేతనాలు వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు.పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, 77 ప్రాజెక్టుల పునరుద్ధరణ లాంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. ప్రతిపక్ష హోదా లేని పార్టీలు కుల, మతాల పేరిట విరుచుకుపడుతూ కూటమిపై విష ప్రచారం చేస్తున్నాయని, జగన్ జైలు యాత్ర, ఓదార్పు యాత్ర పేర్లతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. "మాది మంచి ప్రభుత్వం, జరుగుతున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్తూ వారి దీవెనలు పొందుతున్నాం" అని సుభాష్ అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా. చప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ఎం. గంగయ్య, నియోజకవర్గ, మండల కన్వీనర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# దండుదారి విస్తరణకు మోక్షం

## పనులు ప్రారంభం... బండరాళ్లతో నేల పటిష్టం



**ఉంగుటూరు పెన్ పవర్, జూలై 6 :** నారాయణపురం-తల్లాపురం మధ్య 1 కి.మీ పొడవైన పుంత రోడ్డుకు మళ్లీ ప్రాణం పోసే పనులు వేగంగా ప్రారంభమయ్యాయి. వర్షాలకు దెబ్బతిన్న ఈ దారికి ఇప్పుడు బండరాళ్లతో బలం చేకూర్చుతున్నారు. వర్షాల్లో చెదిరిపోయిన మట్టి రోడ్డుతో గతంలో వేసిన కంకర కూడా పనికిరాకుండా పోయింది. నడవడానికి కూడా ఇబ్బందులు తప్పలేదు. స్థానికుల ఆందోళన, వాహనదారుల ఒత్తిడితో రోడ్డును అత్యవసరంగా అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే ధర్మరాజు ఆదేశాలతో పనులు పునఃప్రారంభం మొత్తం రూ.89 లక్షల ఎంఎస్ఆర్జీఎస్ గ్రాంట్లతో నారాయణపురం-తల్లాపురం, పెద్దింట్లమ్మ గుడి-చేబ్రోలు పోలీస్ స్టేషన్ రోడ్లకు మంజూరైన నిధులతో ఈ పనులు జరుగుతున్నాయి. నారాయణపురం వంతెన మూసివేతతో ఈ మార్గం ప్రాధాన్యం పెరగడంతో పనులు మరింత వేగవంతమయ్యాయి. బండరాళ్లతో నేల గట్టి చేసి తాత్కాలికంగా రాకపోకలు పీఆర్ శాఖ ఆధ్వర్యంలో భారీ క్వారీ రాళ్లను తీసుకొచ్చి, 200 ప్రొక్లయినర్ సాయంతో 3.75 మీటర్ల వెడల్పుతో రోడ్డును విస్తరిస్తున్నారు. ముందుగా నేలపై రోలింగ్ చేసి, తర్వాత కంకర వేశారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలకు వీలు కల్పించేలా యుద్ధప్రాతిపదికన పనులు సాగుతున్నాయి. తర్వాత తారు రోడ్డుగా మార్చనున్నట్టు పీఆర్ ఏఈ కృష్ణమోహన్ తెలిపారు. ఆదివారం ఈ పనులను క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు పరిశీలించగా, గుత్తేదారు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.




# భక్తి, సేవా భావనలతో కిటకిటలాడిన వాడపల్లి క్షేత్రం

## ఏకాదశి పర్వదినం సందర్భంగా వైభవంగా విశేష పూజలు-విరాళాల వెల్లువ



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 6 :** ఆత్రేయపురం మండలంలోని పవిత్రమైన వాడపల్లి క్షేత్రం ఆదివారం తొలిఏకాదశి పర్వదినాన్ని స్వామివారికి అలంకరణ . తెల్లవారుజామునే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అర్చకులు చందన స్వరూపునిగా శ్రీ వెంకటేశ్వర స్వామిని అలంకరించారు. శోభాయమానంగా ఉన్న స్వామివారి దర్శనార్థం దూరాల నుండి వచ్చిన భక్తులు శ్రద్ధాభక్తులతో క్షేత్రాన్ని నింపేశారు. స్వామివారు ఊరేగింపుగా వాడపల్లి పుర వీధుల్లో విహరించగా, భక్తులు మంగళహారతులు సమర్పిస్తూ నినాదాలతో గగనతలాన్ని కంపింపజేశారు. ఈ వేడుకల్లో భాగంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విశేషమైనది ఏమంటే, ఈ పుణ్య సందర్భాన్ని పురస్కరించుకుని అనేక మంది భక్తులు శ్రీ వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు అందజేశారు. వద్దిపర్రు గ్రామానికి చెందిన రావిపాటి గోవిందరావు-రత్నమాల దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 30,001 విరాళంగా సమర్పించగా, యానాం మహానగరానికి చెందిన సలాది శ్రీనివాస్-సత్యవతి దంపతులు రూ. 50,116 విరాళం అందజేశారు. వీరిని ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలతో సత్కరించగా, ఆలయ ఉప కమిషనర్ ఎం.ఎస్. చక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం భక్తి, సేవా దృక్పథాల మేళవింపుతో ఆకట్టుకుంది. ఒకవైపు ఆధ్యాత్మికత, మరోవైపు సమాజ సేవ అన్నది ఈ వేడుకలో ప్రధానంగా కనిపించింది.



# సేవే లక్ష్యం-ప్రజలే ముఖ్యం

## ఆపదలో అండగా... సేవలు అగ్రగామి... పేదల భరోసాగా నిలిచిన మంత్రి వాసంశెట్టి!

**బై లైన్: పెన్ పవర్ ప్రతినిధి, దడాల ఏడుకొండలు-కాకినాడ :**




రామచంద్రపురం నియోజకవర్గం, కోనసీమ జిల్లా ప్రజలకు వాసంశెట్టి సుభాష్ ఒక ఆశాకిరణంలా మారారు. సొంత ప్రాధాన్యం కంటే సమాజమే ముఖ్యమని నమ్మే ఈ నేత, తన రాజకీయ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారు. సార్వత్రిక మానవతా విలువలను ప్రతిపాదిస్తూ, ప్రతి అడుగూ పేద ప్రజల కోసం వేస్తున్నారు.

**ఆపద్బాంధవుడుగా సుభాష్ :** పెద్ద సమస్యలే కాదు, చిన్న ఆపదలోనూ ప్రజలకు అండగా నిలిచే ఆపద్బాంధవుడిగా సుభాష్ సేవలు అందరికీ తెలిసి నవే. వరదలు, రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమా దాలు, ఇతర విపత్తుల సమయంలో ఆయన ప్రత్యక్షంగా సహాయం అందిస్తూ ఉంటారు. ప్రతీ సమస్యకు తనవంతు తోడుగా ఉండి, బాధితులను ధైర్యపరచడంలో ఆయన ముందుంటారు.

**అనాథ పిల్లలకు ఆధారం :**

సమాజం విస్మరించిన 40 మంది అనాథ బాలబాలికలను సుభాష్ గారు స్వయంగా దత్తత తీసుకుని, వారి విద్య, వసతి, జీవనోపాధికి మార్గం చూపారు. ఈ పిల్లలకు తండ్రి బొమ్మలా నిలిచిన సుభాష్, వారికి ఒక సురక్షిత భవిష్యత్తుకు బాటలు వేసి, సమాజానికి ఒక ఉదాహరణ అయ్యారు.

**వాసంశెట్టి ఫౌండేషన్-యువతకు ఉపాధి :**

సమాజపు అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ముఖ్యమని విశ్వసించే సుభాష్ వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ప్రొఫెషనల్ ట్రైనింగ్, చిన్న వ్యాపారాల కోసం ఆర్థిక మద్దతు వంటి పథకాల ద్వారా యువతను ఆత్మనిర్భరులుగా తీర్చిదిద్దుతున్నారు.

**ఆరోగ్య సమస్యలపై సొంత సహాయం :**

రామచంద్రపురం నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి గిరిజన, పేద కుటుంబానికి సుభాష్ గారు సొంత ఖర్చులతో వైద్య సాయం అందిస్తారు. ముఖ్యంగా కేన్సర్, గుండెజబ్బులు వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్నవారికి చికిత్స కోసం ఆర్థిక సహాయం అందిస్తూనే, వారికి ఒక భరోసాగా నిలుస్తున్నారు.

**ప్రతీ పరామర్శలో మానవతా స్పర్శ :**

సాధారణ పరామర్శలు కాదివి-ఒక తండ్రి తన పిల్లల స్థితిని తెలుసుకునే ఆత్మీయత సుభాష్ గారి పరామర్శల్లో ఉంటుంది. బాధితుల దగ్గరకు చేరి వారి సమస్యలు నేరుగా వింటూ, తక్షణమే పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తారు. ఇది ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తుంది-"మన వెంట నడిచే నేత ఉన్నాడు" అనే నమ్మకాన్ని పెంచుతుంది. సమాజం అందించే గౌరవం సుభాష్ సేవా మార్గం పేద ప్రజల గుండెల్లో ఒక చెరగని ముద్ర వేసింది. పేదలు, మధ్యతరగతి వర్గాలు, వృద్ధులు, అనాథలు-ఎవరు చూసినా ఆయనకు "ఔరా" అనాల్సిందే. ఆయన చేస్తున్న ఈ సేవా దిశ ప్రజా నేతృత్వానికి ఒక కొత్త ప్రమాణం.వాసంశెట్టి సుభాష్ సృజించిన సేవా పథం ప్రజాసేవకులకు మార్గదర్శిగా నిలుస్తోంది. నేతగా మాత్రమే కాకుండా మానవతావాది, ఆపద్బాంధవుడు, సమాజ శిల్పి-ఈ మూడు రూపాల్లో ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

# తలుపు తట్టి ప్రభుత్వ విజయాలను గడప గడపకు



**మండపేట.పెన్ పవర్. జూలై 6 :** కూటమి ప్రభుత్వ విజయాలను తలుపు తట్టి గడపగడపకు వివరించడమే సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం అని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధూర్ అన్నారు. ఆదివారం రాయవరం మండలంలోని సోమేశ్వరం, మాచవరం, మండపేట మండలంలోని ఏడిద గ్రామాలలో ఆయన రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుతో కలసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలలో భాగంగా మొదటగా రాష్ట్రంలో పింఛన్ల పండగ నెలకొందన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా నగదు తల్లి ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లతో మహిళల్లో ఆనందం వెల్లువిరుస్తుందన్నారు. ఆగస్టు 15న ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలలో ఒక్కొక్కటిగా నెరవేర్చడం జరుగుతుందన్నారు. ప్రజలలో కూటమిపై అపారమైన నమ్మకం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వ విజయాలను తలుపు తట్టి ప్రజలకు వివరించేందుకు ప్రభుత్వం సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితర్లు పాల్గొన్నారు.

# ఏలేశ్వరంలో సుపరిపాలనలో తొలి అడుగు ప్రచారం



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6 :** మండల పరిధిలోని రమణయ్య పేట గ్రామంలో సుపరిపాలన లో తొలి అడుగు పేరిట టిడిపి శ్రేణులు ఇంటింటి ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. కార్యక్రమంలో భాగంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే సత్య ప్రభ ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేస్తున్న అభివృద్ధిని కూడా ప్రజలకు వివరిస్తూ , స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ముచ్చటిస్తూ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా పెడుతున్నారా లేదని ఆరా తీశారు. ఎన్నో ఏళ్లుగా సమస్యగా మిగిలిన రమణయ్య పేట, జె.అన్నవరం రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు జ్యోతుల పెదబాబు, మీసాల రాజు, పలివెల వెంకటేశ్వరరావు, ఎండిఓ సూర్యనారాయణ, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పశువులను కట్టమని దండోరా వేయించిన స్పందించని రైతులు



**వై రామవరం,పెన్ పవర్, జూలై 6 :** మండలంలో రహదారి ప్రక్కన ఉన్న గ్రామాలలో పశువులను కట్టమని ఆయా పంచాయితీలలో దండోరా వేయించిన ఫలితం లేదని, రైతులు స్పందించిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ఏజెన్సీలో సుమారు ఆరు నెలలు వ్యవసాయ సీజన్లో పశువులను కడతారని, మిగిలిన 6 నెలలు రహదారిపైనే ఉంటాయని తెలిపారు. పశువులను కట్టమని వై. రామవరం ఎంపీడీవో ఆదేశాల మేరకు ఆయా పంచాయతీలలో దండోరా వేయించామని, కట్టకపోతే 500 రూపాయలు ఫైన్ విధించడం జరుగుతుందన్నా రైతులలో చలనం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై పశువులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు అంటున్నారు. రహదారిపై పశువులు ఉండడాన్ని పలుమార్లు పెన్ పవర్ దినపత్రిక వెలుగులోకి తీసుకువచ్చిన సంబంధిత అధికారులు స్పందించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. పశువుల వ్యర్థాల వల్ల రహదారులు బురదమయంగా తయారవుతున్నాయని దీనివల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై పశువులు నివాసం ఉండకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## కాజులూరులో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**కాజులూరు, పెన్ పవర్ జూలై 6 :** కాజులూరు మండలంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి కాజులూరు మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ గారు అధ్యక్షత వహించారు. ముందుగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి, ఆయనను స్మరించారు. ఈ సందర్భంగ ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, పుణ్యమంతుల శివాజీ మాట్లాడుతూ "మన దేశం సౌభాగ్యం కోసం 50 ఏళ్ల క్రితమే డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారు గళం విప్పారు. దేశ ప్రజల కోసం భారతదేశం ఒక్కటిగా ఉండాలని ఉద్యమం చేశారు. దేశ ప్రజల్లో చైతన్యం కల్పించి, 'భారతం ఒకటే' అని అందరికీ తెలియ జెప్పిన మహనీయుడు ఆయన" అని అన్నారు. ఈ వేడుకల్లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మన రాజేష్, వాసంశెట్టి రామకృష్ణ, మండల ఉపాధ్యక్షులు పోలిశెట్టి శ్రీనివాస్, మండల సోషల్ మీడియా కన్వీనర్ పుణ్యమంతుల నరేంద్ర, పి ఏసురత్నం పాల్గొన్నారు. జగన్నాధీరి గ్రామంలో బీజేపీ ఎంపీటీసీ కొప్పన లక్ష్మి ఆధ్వర్యంలో మహిళా బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ వద్ద కూడా నిర్వహించబడినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జూలై 7న కాకినాడలో పీజీఆర్ఎస్ కార్యక్రమం

### -కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ, పెన్ పవర్, జూలై 6 :** జిల్లా ప్రజల ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జూలై 7వ తేదీ సోమవారం నాడు యధావిధంగా జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహించబ డనుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు చెందిన అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. అలాగే మండల స్థాయిలో జరుగుతున్న పీజీఆర్ఎస్ కార్యక్రమాలకు మండల స్థాయి అధికారులు ఉదయం 9:30 గంటలకు విధిగా హాజరు కావలసిందిగా సూచించారు. అర్జీదారులు ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా హాజరుకాలేనట్లయితే, తమ ఫిర్యాదులను meekosam.ap.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదు స్థితి తెలుసుకోవడానికి లేదా ఇతర వివరాల కోసం 1100 నంబర్కు కాల్ చేయవచ్చని చెప్పారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## వైయస్ఆర్సీపీ జిల్లా కార్యదర్శిని అభినందించిన వైయస్సార్సీపి శ్రేణులు



**అమలాపురం పెన్ పవర్ జూలై 6 :** వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పొగాకు శీను ని ఆయన స్వగ్రామునందు పలువురు అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పలగుప్తం జడ్పిటిసి గెడ్డం సంపద రావు, పార్టీ సీనియర్ నాయకులు మోటూరు సత్యం బాబు,పేరూరు సర్పంచ్ దాసరి డేవిడ్ అరుణ అరుణ ,ఎస్ యానం గ్రామ కమిటీ అధ్యక్షులు లంకే శీను ,వైఎస్ఆర్సిపి పులగుప్తం పార్టీ నాయకులు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

### -వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 6 :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఈనెల 8వ తేదీన ప్రత్తిపాడు లయన్స్ క్లబ్లో నిర్వహి స్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గ్రామాల్లో ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను ప్రజలకు తెలియజేయడమే కాకుండా, నియోజకవర్గంలో జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడడానికి రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పార్టీ శ్రేణులు ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసి అనేక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అత్యవసరమైన సమయాల్లో రక్తాన్ని అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఘనంగా ఏకలవ్యుడు జయంతి



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 6 :** ఏకాగ్రత తో విలువిద్య ను పొమందిన ఏకలవ్యుడు జయంతిని తొలిఏకాదశి ని ఏకలవ్య ఎరుకల యువజన సంఘం, నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ఏకలవ్యుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు అనంతరం సంఘ నాయకులు ఏకలవ్యుడు జయంతి సందర్భంగా కేక్ కట్ అందరకు పంచారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు భారతి వాసు, గాడ గణేష్, మానుపాటి గోవింద్, బండారు సత్యనారాయణ, గాడ పండు, లోకుల సురేష్, గాడ పోసు, గాడ పెద్దిరాజు, మానుపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు ప్రజా సంక్షేమానికి గొడుగు



**సీతానగరం, పెన్ పవర్, జూలై 06 :** సుపారిపాలనలో తొలి అడుగు పడింది. ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం గొడుగు పడుతోంది. ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేయడంతో పాటు ఇచ్చిన హామీలను కూడా అమలు పరుస్తోందని రాజానగరం టిడిపి ఇన్చార్జ్ మరియు రాష్ట్ర కార్యదర్శి రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి అన్నారు, కూటమి ప్రభుత్వం పాలన ఏడాది పూర్తైన సందర్భంగా గ్రామ గ్రామాన ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వ పాలన గురించి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సీతానగరం మండలంలోని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారంనాడు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాది కాలం పూర్తి చేసుకున్న ఎన్డీఏ ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు అన్ని సంక్షేమ పథకాలను తీసుకువచ్చి పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతుందని ఆయన తెలిపారు, ఒక పక్క సంక్షేమం మరో పక్క అభివృద్ధిని ఏకకాలంలో అమలుపరుస్తుందని రుడా చైర్మన్ వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలనుతెలుసుకోవాలన్నారు, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలను ప్రజలకు తెలియజేయడంతో పాటు అభివృద్ధిని కూడా వివరించాలన్నారు. మండలములోని ఆయా కరస్టర్ ఇన్చార్జిల ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్ కే గ్రామ కమిటీల ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించే తొలి అడుగు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ప్రజలకు మరింత చేరువవ్వాలని టిడిపి ఇన్చార్జి బొడ్డు తెలిపారు. తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందించడంతోపాటు ఏడాది పాలన పై ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని మై టిడిపి యాప్ లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమల పై స్వయంగా ప్రజలతోనే చర్చించారు. పేదరికం లేని సమాజ నిర్మాణ కోసం ప్రతి ఇంటి పేదరికాన్ని దూరం చేసే ప్రక్రియలో భాగంగా నవ సమాజ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తూ నవశకానికి నాంది పలికే విధంగా ప్రజాప్రతినిధులు కార్యకర్తలు గ్రామీణ పట్టణ స్థాయిలో ప్రతి గడపని సందర్శించి ప్రభుత్వ పరిధిలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై కులం కుశంగా వివరించాలని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు, ఈ కార్యక్రమంలో గద్దె వెంకటకృష్ణ చౌదరి, ఓబులనేని కృష్ణ చైతన్య, మండల టిడిపి అధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు, కాంద్రు శేఖర్, ముత్యం వెంకటేశ్వరరావు, పెందుర్తి అచ్యుత రామారావు, గంటా రామకృష్ణ, చెరుకూరి ఫణి కుమారి, ఎస్.కె మీరా షరీఫ్ రాజు, తదితరులు పాల్గొన్నారు,

## రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పణ





**అడ్డతీగల ,పెన్ పవర్ , జూలై 6 :** అడ్డతీగల మండలం వేటమామిడి శివారు వేంచేసి ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో తొలి ఏకాదశి ని పురస్కరించుకొని,అమ్మవారికి భారీ సంఖ్యలో బోనాలు సమర్పించారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం నుండి ఊరేగింపుగా బోనాలు తీసుకొచ్చి,అమ్మవారిని సమర్పించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు సుమారు 3,000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు కమిటీ వారు తెలిపారు.

## సూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో కాషాయ ధ్వజస్థాపన



**గోకవరం, పెన్ పవర్, జూలై 06 :** తొలి ఏకాదశి శుభ సందర్భాన్ని పురస్కరిం చుకుని సూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో గోకవరంలోని గీతా మందిరం వద్ద చాతు ర్మాస్య వ్రత దీక్షలో భాగంగా కలశ స్థాపన, కాషాయ ధ్వజస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయి బాబా మాట్లాడుతూ తొలి ఏకాదశి తిధినాడు సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించిన కారణంగా దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభమవుతుందని దీని ప్రభావంతో అనంత విశ్వంలో, సూక్ష్మ భూమికలో, కాలంలో సంభవించిన మార్పులు సమస్త జీవరాశుల పట్ల శాంతిగా ప్రభావం చూపేటట్టుగా ఈ తొలి ఏకాదశి తిథిని భగవత్ ఉపాసనతో ముడి పెట్టడం భారతీయ రుషుల దివ్యదృష్టికి నిదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో గంటా రఘుపతి,గండి వాణి,కొప్పిశెట్టి సుజాత, గొల్లపల్లి పోషిరత్నం,తటవర్తి సత్యవతి,చవ్వాకుల గౌరమ్మ,ఆదం అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## పైడిమెట్టలో బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 6 :** బాబూ జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతి సందర్భంగా పైడిమెట్ట జగ్జీవన్ రామ్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ అధ్యక్షులు కొప్పాక పోసియ్య మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దళితుల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు. భారత ప్రభుత్వంలో అనేక మంత్రి పదవులు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు దున్నా దుర్గారావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ జీవితం నుండి దళితులు స్ఫూర్తిని పొందాలన్నారు. జగ్జీవన్ వలె రాజకీయ అధికారం పొంది జాతి అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో గెడ్డం రాజు, బొట్టా భాస్కరరావు, పసలపూడి పుష్పరాజు, గెడ్డం గణేష్, గెడ్డం గాంధీ, విజేత పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు డా.ప్రమోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బాటలో నడవాలి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 6 :** భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వంటి మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పదంలో పయనిస్తోందని బిజెపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి నివాళులర్పించారు. ముఖర్జీ 125 వ జయంతి పట్టణ కార్యాలయంలో ఆదివారం జరిగింది. జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వం సంతుష్టికరణ విధానాలను వ్యతిరేకిస్తూ పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ తన పదవికి రాజీనామా చేసి దేశ సమైక్యత కోసం భారతీయ జన సంఘ పార్టీని నెలకొల్పారు. కాశ్మీర్ కి ప్రత్యేక ప్రతిపాదన వ్యతిరేకించి ఒక దేశంలో ఒకే జెండా ఓకే రాజ్యాంగం ఉండాలని, కాశ్మీర్ కు ఆర్టికల్ 370 చేయాలని ఉద్యమిస్తూ కాశ్మీర్ రాష్ట్రానికి వెళ్లారని అక్కడి ప్రభుత్వ ఆయన ను అరెస్టు చేసి జైలు పాలు చేసిందని అనుమాన అనుమానాస్పద స్థితిలో మరణించారని అన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన గ్రామప్రసాద్ ముఖ జీవ అంటే మహనీయుల ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. పార్టీకి అధ్యక్షులు సుప్రీమని, వారి వారి నాయకత్వంలో ప్రతి ఒక్కరు పని చేయాల్సిందే అని స్పష్టం చేశారు. సమస్యలుంటే అను దృష్టికి తీసుకురావచ్చు అని తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాలను అందరూ పాటించాలని స్పష్టం చేశారు. బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ మాట్లా డుతూ జనతా పార్టీ నేడు ఈ స్థాయిలో అభివృద్ధి చెందు తుంది అంటే చాలా ప్రసాద్ ముఖర్జీ వంటి నాయకులు త్యాగాలే కారణ మన్నారు. ఆయన ఆశయాలను సాధించేందుకు ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచే యాలని పిలుపునిచ్చారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట భీమశంకర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదపోలు వీర రాఘవులు, మాట్లాడుతూ నేడు భారతదేశ నరేంద్ర మోడీ వంటి నేతల నాయకత్వం అభివృద్ధి చెందుతున్న అంటే నాడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వంటి మహనీయులు సిద్ధాంత బలమే కారణమన్నారు. బిజెపి నాయకులు కార్యకర్తలు ఆయన బాటలో పైనుంచి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ పార్టీలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, క్రమశిక్షణ తో ముందుకు సాగాలని కోరారు. పార్టీ అధిష్టానం ఆదేశాలమేరకు మండల కమిటీల్లో ప్రతి ఒక్కరు ఏకీకృతం గా పని చేయాలని అన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అయినం బాలకృష్ణ, కోకన్వీనర్ రామగాని సత్యనారా యణ, బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ , పట్టణ ప్రధాన కార్యదర్శులు చిట్యాల రాంబాబు, గరగా ప్రసాద్, ఉపాధ్యక్షులు లచ్చిరెడ్డి సత్యనారాయణ, శిరిగినీడి పాండురంగా రావు, కార్యదర్శులు తుమరాడ చిన్న, పోతిరెడ్డి రాజారావు, ఎస్వీ రంగారావు, కసిరెడ్డి నాగ దుర్గ, కోశాధికారి యార్నాల సూర్యనారాయణ, యువ మోర్చా జిల్లా కార్యదర్శి పత్స గోపాలకృష్ణ , శీతాళం విజయకుమార్, యువ మోర్చా పట్టణ నాయకులు కంచర్ల రాజా, మోటూరి వెంకటరత్నం, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్, మహిళామోర్చ నాయకురాలు పెంటపాడు మండల కార్యదర్శి ఆరాధ్యుల అంజిబాబు గోకా మహాలక్ష్మి, సన్నిధి లక్ష్మి దుర్గ, కళ్యాణి పాల్గొన్నారు.

## రోడ్లపై ఉండే పశువులను గోశాలలకు తరలిస్తాం

### ఎంపీడీవో హెచ్చరిక



**వై.రామవరం, పెన్ పవర్, జూలై 6 :** సోమవారం సాయంత్రం పశువులు రోడ్లపై ఉంటే రాజమండ్రి, కాకినాడ గోశాలకు తరలిస్తామని ఎంపీడీవో హెచ్చరిక జారీ చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేటికీ రహదారి ప్రక్కన ఉన్న గ్రామాలలో పశువులను కట్టడం లేదని తెలిపారు. పశువులను విధిగా కట్టాలని, లేనియెడల పోలీస్, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలోనూ, వివిధ శాఖల సిబ్బంది సహకారంతో రోడ్డుపై ఉన్న పశువులను గోశాలలకు తరలించడం జరుగుతుందని హెచ్చరించారు. దేవరమడుగుల, చవిటి దిబ్బలు, పనసల పాలెం, వై రామవరం, చామగడ్డ, దాలిపాడు గ్రామాల రహదారులపై పశువులు ఉండడానికి గమనించామని ఆయన అన్నారు. ఆదివారం మరలా ఒకసారి దండోరా వేయిస్తామని, అప్పటికి రైతులు పశువులను కట్టకపోతే సోమవారం సాయంత్రం పశువులను గోశాలకు తరలిస్తామని తెలిపారు. ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు.

## కిర్లంపూడిలో ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 6 :** కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో రాజు హాస్పిటల్ వద్ద జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు, జగ్గంపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ ఆదేశాల మేరకు నిర్వహించిన జయంతి వేడుకల్లో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరణం రాజబాబు శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం టౌన్ మాజీ అధ్యక్షులు పసుపులేటి సత్తిబాబు, కిర్లంపూడి మండలం ప్రధాన కార్యదర్శి, ఐ వి వి సత్యనారాయణమూర్తి, మండల బిజెపి ఉపాధ్యక్షులు బుద్ధ పెద్దకాపు, ఇసరపు శివబాబు,మాజీ ఉపాధ్యక్షులు శరకణం కన్నారావు, సోషల్ మీడియా కన్వీనర్ దాడి వెంకటేష్, బిజెపి నాయకులు పెంటకోట సత్యనారాయణ, మారిశెట్టి త్రిమూర్తులు, అతికంశెట్టి సత్యనారాయణ, శరకణం వీరబాబు, బుద్ధ నానాజీ, పలువురు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నడిపూడిలో సుపరిపాలన తొలి అడుగు ప్రచారం



**అమలాపురం పెన్ పవర్ జూలై 6 :** మండలం, లోని నడిపూడి గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించి పెంచి ఇస్తున్న పెన్షన్లు, చదివే పిల్లలు అందరికీ ఇచ్చిన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి ఎమ్మెల్యే ఆనందరావు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహ కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా అల్లాడ స్వామి నాయుడు, మాజీ జెడ్పీటీసీ అధికారి జై వెంకట్ లక్ష్మి బాబ్జి, అమలాపురం టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, మట్టమహాలక్ష్మి ప్రభాకర్, మాజీ జడ్పిటిసి ఎరుబండి వెంకటేశ్వరరావు, రాజులపూడి బీముడు, చింతా శంకరమూర్తి, మాడ మాధవి, దేవరపల్లి వీరేష్ కుమార్, మందా గద్దయ్య, మాజీ టిడిపి అధ్యక్షులు మల్లులు పోలయ్య, అరిగేలా శ్రీనివాసరావు, గోసింగి శ్రీనివాసరావు, కడియం సత్యనారాయణ, చింతా శ్రీనివాసరావు, కుడుపూడి శ్రీనివాసరావు, నందెపు సత్యనారాయణ, రాయుడు సత్యనారాయణ, మోరి అంజలి దేవి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి నాడు తొలి అడుగుకి శ్రీకారం చుట్టిన అన్నదేవరపేట కూటమి నాయకులు



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 6 :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపు మేరకు అన్నదేవరపేట బీసీ కాలనీలో తొలి అడుగు వేసి, పేద ప్రజల హృదయ స్పందన తెలుసుకోవటం జరిగిందని కూటమి నాయకులు తెలియజేశారు. బీసీ కాలనీలో ఇంటింటికి నాయకులు, కార్యకర్తలు తిరుగుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అదేవిధంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి గణపతి, కూచిపూడి హరిప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

### - సీతపల్లి వాగు వద్ద పోలీసులు హెచ్చరిక..
### - రంపచోడవరం సీఐ రవికుమార్,ఎస్సై రామకృష్ణ సూచనలు..





**దేవీపట్నం/రంపచోడవరం,పెన్ పవర్, జూలై6 :** రంపచోడవరం మండలంలోని సీతపల్లి వాగు సమీపంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో స్థానిక పోలీసులు పర్యాటకులకు అప్రమత్తత సూచనలు అందించారు.ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్,ఎస్సై రామకృష్ణ సమన్వయంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.వర్షాకాలంలో వాగులు వరద నీటితో పొంగిపొర్లే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, పర్యాటకులు వాటిలోకి దిగితే ప్రాణాపాయం తప్పదని వారు హెచ్చరించారు. ముఖ్యంగా గత కొన్ని రోజులుగా జరిగిన కొన్ని సంఘటనల్లో పర్యాటకులు వాగులోకి దిగిన నేపథ్యంలో ప్రమాదాలు సంభవించినట్లు గుర్తించారు.దీంతో భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ అవగాహన కార్యక్రమం చేపట్టారు.సీఐ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి పర్యాటకుడు తన ప్రాణభద్రతను కాపాడుకునే బాధ్యతతో ఉండాలి.వాగులో ప్రవేశించకుండా, అధికారుల సూచనలు పాటించాలి, అని చెప్పారు.ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ..ప్రజల ప్రాణాలు మాకు మించినవి కావు.కాబట్టి ఎవరూ కూడా వాగులోకి దిగవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అని చెప్పారు.అవగాహన కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు పర్యాటకులు,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇటువంటి చర్యల ద్వారా పర్యాటక ప్రదేశాల్లో భద్రత పెరిగే అవకాశముందని నిర్వాహకులు భావిస్తున్నారు.

## సామూహిక సీమంతాల్లో ఆదివాసీ గర్భిణులకి ఘన సత్కారం





**దేవీపట్నం/రంపచోడవరం,పెన్ పవర్,జూలై6 :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివాసీ గర్భిణీ మహిళలకి సామూహిక సీమంత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.రంపచోడవరం పరిసర ప్రాంతాలకు చెందిన 126 మంది గిరిజన మహిళలకు గిరిజన పూజారుల ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతుల్లో సీమంతాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం,అనకాపల్లి శోహంఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అరుణానంద స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై శ్రీ వేంకటేశ్వర స్వామివారి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.టి.కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి,మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వేంకటేశ్వరరావు,ట్రస్ట్ వ్యవస్థాపకుడు వెంకట్ ఊత్కూరు(యూఎస్ఏ),ఇతర ప్రముఖులు సూర్య రాట్నాల,తోట రామకృష్ణ,కాటమరెడ్డి,ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సీమంతంలో పాల్గొన్న గర్భిణీలకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, పండ్లు, పూలు, స్వీట్లు అందించి ఆశీర్వచనాలు ఇచ్చారు.స్థానిక ధార్మిక సంస్థల ప్రతినిధులు,గిరిజన పూజారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## డా. బాబు జగజ్జీవన్ రామ్ చిరస్మరణీయుడు

### - ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్ జూలై 6 :** బాబు జగ్జీవన్ రామ్ చరిత్రలో ఓ చిరస్మరణీయ నాయకుడు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం పోరాటం చేసిన నాయకుడని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద బాబు జగ్జీవన్ రామ్ గారి వర్ధంతిని ఎమ్మార్పీ ఎస్ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ చరిత్రలో ఓ చిరస్మరణీయ నాయకుడు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం పోరాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా అందరి హృదయాలలో నిలిచరన్నారు. కేంద్ర మంత్రిగా, ఉపప్రధానిగా భారతదేశ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. అంతకముందు బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదలశాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, బీ.సి. కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎమ్. పి.పి. దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటిసి బూడిద వరలక్ష్మి, పి.కె.రావు, నాగాబత్తుల సుబ్బారావు, మైపాల తాతాజీ, రవణం రాము, అరిగెల సూరిబాబు, కొర్లపాటి గోపి, విత్తనాల శేఖర్, దొమ్మేటి సాయకృష్ణ, పత్తి దత్తుడు, గంటి శ్రీ రామమూర్తి, పేరాబత్తుల పెద సుబ్బరాజు, ఎమ్మార్పీ ఎస్ నాయకులు ఉందుర్తి నాగాబు, దిగుమర్తి చిట్టిబాబు, ఈతకోట నాగరాజు, తొత్తరమూడి గోవిందు, నేదునూరి ఏసు, ఉందుర్తి ఆనందబాబు, లంక వెంకటరెడ్డి, నేదునూరి రాజ్ కుమార్, మంద రాజేష్, కొర్లపాటి ఢిల్లీ, కొప్పినీడి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సీతపల్లిలో నెల రోజుల క్రికెట్ టోర్నీ

### విజేతగా లొద్దిపాలెం జట్టు ఉత్కృష్ట ప్రదర్శన..
### పండా వరలక్ష్మి, బాపన్నదొర చేతుల మీదుగా బహుమతుల ప్రదానం..
### గ్రామస్థుల సహకారంతో విజయవంతమైన టోర్నీ..





**దేవీపట్నం,పెన్ పవర్,జూలై6 :** రంపచోడవరం మండలం సీతపల్లి గ్రామంలో నెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది.గ్రామస్థుల సహకారంతో సోదే వినోద్ కుమార్,ధర్మకుమార్ (దాస్) నిర్వాహకులుగా ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు.ఈ టోర్నీలో రంపచోడవరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 46 జట్లు పాల్గొన్నాయి.ఫైనల్ మ్యాచ్‌లో లొద్దిపాలెం జట్టు దేవీపట్నం జట్టును ఓడించి విజేతగా నిలిచింది. విజేతలకు రూ.10,000,రన్నరప్ జట్టుకు రూ.5,000 నగదు బహుమతులను జనసేన వీర మహిళ పండా వరలక్ష్మి,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుంజం బాపన్నదొర అందజేశారు.ఈ సందర్భంగా పండా వరలక్ష్మి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకూ,జూదక్రీడలకూ దూరంగా ఉండి క్రీడల ద్వారా సన్మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. టోర్నీకి ఆహ్వానించిన నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల ప్రోత్సాహార్థం గ్రామస్థులు కుంజం బాపన్నదొర,కొమరం రామన్నదొరలు రెండు ఎకరాల ఆటస్థలాన్ని యువతకు అందజేశారు. వారి సహకారానికి యువత కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బందం సత్యనారాయణదొర,బొరగా బాలుదొర, కలుం తమ్మన్నదొర,బందం వీరయమ్మ,చవలం శివశంకర్, దాసు, వినోద్, భీమా,దొరబాబు,వంశీ,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కె. పెదపూడిలో డా.బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతి



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 6 :** స్థానిక పంచాయితీ ఎదురుగా ఉన్న డా. బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహం వద్ద వర్ధంతిని ఆదివారం ఎమ్మార్పీ ఎస్. నాయకులు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్.నాయుకులు అధ్యక్షుడు లంక వెంకట రెడ్డి మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ తొత్తరమూడి వెంకటరమణ మాదిగ ఉపాధ్యక్షులు నేదునూరి చిన్న శ్రీను మాదిగ, ప్రధాన కార్యదర్శి చుట్టాగుల్ల శ్రీనివాస్ మాదిగ, కార్యదర్శులు ఉందుర్తి ప్రసాద్ మాదిగ, కోశాధికారి నందేపు వెంకట రమణ మాదిగ ప్రచార కార్యదర్శులు ఉందుర్తి ఆనందబాబు మాదిగ, కార్యదర్శి సభ్యులు, .నూటుకుర్తి సంజయ్ మాదిగ, ఈతకోట రామ్ చరణ్ మాదిగ, నేదునూరి సురేష్ కుమార్ మాదిగ, ఉందుర్తి శ్రీను మాదిగ, ఉందుర్తి సత్య బాబు మాదిగ తొత్తరమూడి శంకర్ మాదిగలు అధిక సంఖ్యలో ఎమ్మార్పీ ఎస్.నాయకులు పాల్గొన్నారు.

## జూనోటిక్ వ్యాధులపై అవగాహన





**దేవీపట్నం/రంపచోడవరం,పెన్ పవర్ జూలై 6 :** ప్రపంచ జూనోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హీఫర్ ఇంటర్నేషనల్,నవజీవన్ సంస్థలతో కలిసి పశుసంవర్ధక శాఖ అధికారులు రంపచోడవరం ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హైస్కూల్,జూనియర్ కాలేజ్ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.జూనోటిక్ వ్యాధుల ప్రభావం, నివారణపై ఉపసంచాలకులు డా.షరీఫ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హీఫర్ సంస్థకు చెందిన డా.గణేష్,నవజీవన్ బీడీవో ఎం.నాగేశ్వరరావు,పారావిట్లు శ్యామల,పృధ్వి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు యధావిధిగా పీజీఆర్ఎస్

### - జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జులై 6 :** ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ జూలై 7వ తేదీ సోమవారం యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం "1100" మీకోసం కాల్ సెంటర్ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు, నమోదైన మీ అర్జీ ప్రస్తుత స్థితి తెలుసుకోవచ్చునని ఆమె తెలిపారు. జూలై 7వ తేది ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల,సచివాలయాల స్థాయిలో స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం meekosam.ap.gov.in పోర్టల్ లేదా 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. నేరుగా అర్జీలు ఇవ్వలేని వారు మీ కోసం వెబ్ సైట్ లో ఆన్‌లైన్ ద్వారా మీ ఫిర్యాదు నమోదు చేయవచ్చు అని ఆమె తెలియ చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా ప్రజలు పౌర సేవలు పొందవచ్చు అని పేర్కొన్నారు. అందుకోసం ప్రజలు వారి సెల్ ఫోన్లలో ఈ నంబర్ సేవ్ చేసుకోవాలని కోరారు.

## కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 6 :** పట్టింపాలెంలో కుక్కలకు ఉచితం గా యాంటీ రాబీస్ టీకాలు వేశారు. ప్రపంచ జూనొసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టింపాలెం గ్రామంలో ఉచితంగా యాంటీ రాబీస్ టీకాలు వేశామని మండల పశు వైద్యాధికారి డాక్టర్. టీ.వి.విజయ్ కుమార్ తెలిపారు. గ్రామం లో 13 పెంపుడు కుక్కలకు టీకాలు వేశామని మిగిలిన వారు పశు వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటెండర్ గంగరాజు, సిబ్బంది, కుక్కల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏఓఐ భీమడోలు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

### జూలై 9న దేశవ్యాప్తంగా కార్మిక ఆందోళన



**ఉంగుటూరు, పెన్ పవర్ జూలై 6 :** ప్రపంచంలో జీవిత బీమా రంగంలో భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) నాలుగో స్థానంలో ఉందని ఎల్ఐసి ఏవోఏ రాష్ట్ర కార్యదర్శి గొట్టపు రవి కిషోర్ పేర్కొన్నారు. ఆయన భీమడోలు ఎల్ఐసి ఏఓఐ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదావరి జగన్మోహన్ రావును గౌరవాధ్యక్షుడిగా, కమ్మెల సుబ్బారావును అధ్యక్షుడిగా, తలగళ్ల శ్రీనివాసరావును కార్యదర్శిగా, చీమకుర్తి హనుమంతరావును కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈసీ సభ్యులుగా 11 మంది ప్రమాణ స్వీకారం చేశారు. "ఏజెంట్ల హక్కుల రక్షణకు నిరంతరం పోరాటం" ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ, ఏజెంట్ల హక్కులను నిర్వీర్యం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుండటం నేపథ్యంలో నిరంతర పోరాటం కొనసాగుతున్నదన్నారు. జూలై 9న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక హక్కుల సాధన కోసం భారీ ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రముఖులు పాల్గొన్న కార్యక్రమం ఈ కార్యక్రమంలో బీబీకే దుర్గాప్రసాద్, పూజారి వెంకట రమణ, దోకల నాగేశ్వరరావు, పీవీ సత్యనారాయణ, ఎంవీ లక్ష్మీ, అప్పారావు, ఏఎస్ కిషోర్, బీ శివకుమార్, ఎంబీఏ రమణ, యు ప్రశాంతి, సిహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

## 53 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 6 :** జగ్గంపేటలో ప్రపంచ జోనోసిస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం జగ్గంపేటలోని ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.తాతయ్య ఆధ్వర్యంలో ఉచిత రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగ్గంపేట పరిసర ప్రాంతాల వారికి చెందిన 53 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ లు వేయడం జరిగిందని డాక్టర్ తాతయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్గంపేట మణికర్ణిక టీమ్ కు ప్రశంసలు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 6 :** జగ్గంపేట మణికర్ణిక టీమ్ సభ్యులు 13 మంది హైదరాబాద్ కు వెళ్లి చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో రక్తదానం చేశారు. ఆదివారం మేడిది సుబ్బయ్య ట్రస్టు ద్వారా మెగా బ్లడ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మణికర్ణిక యువజన సంఘం వ్యవస్థాపకులు గున్నాబత్తుల అనూష మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించి ఎంతో మందికి ప్రాణాదతలు అయ్యారన్నారు. రక్తం కోసం ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం అందించడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగా మేడిది సుబ్బయ్య ట్రస్టు ద్వారా బ్లడ్ క్యాంప్ నిర్వహించి మాకు ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం రాష్ట్ర చిరంజీవి యూత్ ప్రెసిడెంట్ స్వామి నాయుడు సంఘము చేసే సేవా కార్యక్రమాలను అభినందించారు. మేడిద సుబ్బయ్య ట్రస్ట్ చైర్మన్ జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు శ్రీనివాస్, చిక్కాల మణికంఠ, వీరబాబు, స్వామి, వంశీ, అనిల్, ప్రసాద్, మణి, అర్జున్ తదిరదులు పాల్గొన్నారు.

## చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి భారీ విరాళం



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 06 :** చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఆలమూరుకు చెందిన సత్యలక్ష్మి రైస్ మిల్స్ అధినేత వెత్సా గవర్రాజు అండ్ పార్ట్నర్స్ భారీ విరాళాన్ని అందించారు. ఆలయంలో రాజగోపురాల నిర్మాణంలో వినియోగించమని కోరుతూ రూ. 1,00,116లు విరాళంగా అందించారు. కార్యక్రమంలో వెత్సా నెహ్రూ,వెత్సా సురేష్, వెత్సా రాము,వెత్సా గుప్తా,వెత్సా సూరిబాబు, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు, గన్ని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'అయినవిల్లిలో మద్యం సిండికేట్ అరాచకాలు'

### విఘ్న నాయకుడి కోడ్‌తో మద్యం సీసాలు
### 'ఏవీ' తప్ప ఇంకేవీ ఉండకూడదు : మాఫియా హుకుం







**అమలాపురం, పెన్ పవర్ జూలై 6 :** అయినవిల్లి మండలంలో మద్యం సిండికేట్ బాగా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలి, సిండికేట్ సభ్యులు ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. మండలంలో శుద్ధమైన తాగునీరు దొరకడం కష్టమైనా, అనధికారిక మద్యం బెల్ట్ షాపులు అడుగడుగునా ఏర్పాటై, "మద్యం ఏటీఎం" లా ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాయి. ఈ బెల్ట్ షాపులు మందుబాబులకు అధిక ధరలతో మద్యం అమ్ముకుంటూ సిండికేట్‌కు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. రాత్రీ పగలూ తేడా లేకుండా అధిక ధరలకు అమ్ముకుంటూ మందు బాబులను దోచుకుంటున్నారు.

**అధికారిక షాపులు 5, బెల్ట్ షాపులు 240 :** ప్రభుత్వం అయినవిల్లి మండలంలో కేవలం 5 మద్యం షాపులకు మాత్రమే అధికారిక అనుమతి ఇచ్చినప్పటికీ, సిండికేట్ ఆధ్వర్యంలో సుమారు 240 అనధికారిక బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. ఈ బెల్ట్ షాపులు ప్రతి మద్యం సీసాపై రూ. 20 అదనంగా వసూలు చేస్తున్నాయి. అంతేకాక, గ్రామాల్లో సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి, మందుబాబులను ఆకర్షిస్తున్నాయి. అధికారులు సింహభాగం సిండికేట్‌తో ఒప్పందాలు కుదుర్చుకుని, అనధికారిక కార్యకలాపాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మద్యం షాపు యజమానులు స్వతంత్రంగా తమ షాపులను నిర్వహించేవారు. అయితే, లాభాలు తగ్గుతాయనే ఉద్దేశంతో ఐదు అధికారిక షాపుల యజమానులు సిండికేట్‌గా ఏకమై, మండలంలోని 21 గ్రామాలకు మద్యం సరఫరా చేసే విధానాన్ని రూపొందించారు. ఒప్పందంలో భాగంగా అయినవిల్లి సెంటర్‌లోని ఒక ప్రధాన షాపు నుంచి 240 బెల్ట్ షాపులకు మద్యం సీసాలు సరఫరా చేస్తున్నారు. ఈ సీసాలపై సిండికేట్ గుర్తుతో "ఏవి బ్రాండ్" (అయినవిల్లిలో ప్రసిద్ధ దేవతామూర్తి పేరు) స్టిక్కర్ ముద్రించి, ఒక్కో సీసాపై రూ. 10 సిండికేట్ వసూలు చేస్తుండగా, బెల్ట్ షాపు నిర్వాహకులు మరో రూ. 10 నుంచి రూ. 20 అదనంగా వసూలు చేస్తున్నారు.

**అనధికారిక తనిఖీలు, కఠిన హెచ్చరికలు**

సిండికేట్ గుర్తు లేని మద్యం సీసాలు అమ్మితే కేసులు నమోదు చేయిస్తామని సిండికేట్ హెచ్చరిస్తోంది. దీంతో బెల్ట్ షాపు నిర్వాహకులు ముక్తేశ్వరం వెళ్లి సిండికేట్ గుర్తుతో మద్యం సీసాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనధికారిక సిట్టింగ్ రూమ్‌లు, అధిక ధరలతో అమ్మకాలు జరుగుతున్నప్పటికీ, ఎక్సైజ్ అధికారులు దీనిపై దృష్టి పెట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. సిండికేట్ నియంత్రణలో మండలం సాగుతోందని, అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని మద్యం వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని శివారు గ్రామాల్లో బెల్ట్ షాపు నిర్వాహకులు పక్క మండలాల నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేస్తే, సిండికేట్ వారిని లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేయిస్తోందని సమాచారం. ఇలాంటి బెల్ట్ షాపులను మళ్లీ నడపాలంటే రూ. 25,000 నుంచి రూ. 50,000 వరకు సిండికేట్ డిమాండ్ చేస్తోందని తెలుస్తోంది. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ముడుపుల మత్తులో ఎక్సైజ్ అధికారులు**

కార్మికులు, కూలీలు ఎక్కువగా ఇష్టపడే చవకైన మద్యం ప్రధాన షాపుల్లో దొరకడం కష్టమైనప్పటికీ, బెల్ట్ షాపుల్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఈ విధంగా కూలీలు దోపిడీకి గురవుతూ అనారోగ్యాల పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించినప్పటికీ, ఈ నిబంధనలు అయినవిల్లిలో పూర్తిగా గాలికి కొట్టుకుపోతున్నాయి. సిండికేట్ ఒప్పందాలతో ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలు ఉన్నాయి. అనధికారిక బెల్ట్ షాపులు బహిరంగంగా నడుస్తున్నప్పటికీ, వాటిపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒకవైపు ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో మద్యం విక్రయిస్తూ, మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్న సిండికేట్, మండలంలో అధికారులను, మందుబాబులను శాసిస్తోందని చర్చ నడుస్తోంది.

### ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళకు

## రూ.10 వేలు సహాయం చేసిన మంత్రి సుభాష్



**కాకినాడ, పెన్ పవర్,జూలై 6 :** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన సహృదయాన్ని చాటారు. కాకినాడ సంజయ్ నగర్ కు చెందిన దమ్ము లక్ష్మి అనే మహిళ కాకినాడ పర్యటనలో ఉన్న మంత్రి సుభాష్ ను కలసి తన సమస్యలను విన్నవించింది. తాను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, భర్త రాము ఆరోగ్యం సరిగా లేనందున కుటుంబం దుర్భితిలో ఉందని చెప్పింది. మహిళ విన్నపం పై మంత్రి సుభాష్ వెంటనే స్పందించి రూ. 10,000 ఆర్థిక సహాయం చెక్కు రూపం లో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, పేదల సమస్యలు తక్షణమే పరిష్కరించడం తన ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్, నురుకుర్తి వెంకటేశ్వర్లు, ఇతర బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

### జూనియర్ వెటర్నరీ అధికారి పరిశికఅప్పన్నబాబు




**గంగవరం, పెన్ పవర్, జూలై 6 :** పెంపుడు కుక్కల పెంపకందారులు తమ కుక్కలకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించి వాటికీ వచ్చే వ్యాధుల నుండి కాపాడుకోవాలని నెల్లిపూడి గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక. అప్పన్నబాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985 జులై 6 న ఫ్రెంచ్ శాస్త్రవేత్త అయిన లూయిస్ ప్యాచ్చర్ సంక్రామిక వ్యాధి అయిన " రేబిస్ వ్యాధి " మొట్ట మొదటి సారిగా ఒక బాలునిపై ప్రయోగించి విజయవంతం అయినందువల్ల ప్రతీ సంవత్సరం జులై 6 న ప్రపంచ సంక్రమిక వ్యాధుల దినోత్సవం జరపడం జరుగుతుందని, సంక్రామిక వ్యాధులంటే మనుషులు ఎక్కువగా రోజు పశుపక్ష్యాదులు తో సంబంధం కల్గి ఉన్నందువల్ల వాటికీ వచ్చే వ్యాధులయిన బ్రుసెల్లోసిస్,అంత్రాక్స్, రేబిస్ వంటి వ్యాధులు మనుషులకు అలాగే మనుషల నుండి పశువులకు వచ్చే వ్యాధులను సంక్రామిక (జూనోటిక్ ) వ్యాధులు అంటారని వాటికీ చికిత్స కన్నా నివారణ మేలు అన్నట్లు ముందుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించి వ్యాధి రాకుండా కాపాడుకోవాలని ప్రతీ సంవత్సరము జులై 6 న పశుసంవర్ధక శాఖ పెంపుడు కుక్కలకు సమీప పశు వైద్యశాల యందు పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారని ఆదివారం సంక్రామిక వ్యాధుల దినోత్సవ సందర్భంగా మండలం లో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని ఇంకా టీకాలు వేయించని కుక్కల పెంపకం దారులు పశువైద్యశాల లో సిబ్బందిని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.

## హనుమాన్ చాలీసా పారాయణంతో శాంతి, సౌభాగ్యం



**సామర్లకోట, పెన్ పవర్, జూలై 6 :** హనుమాన్ చాలీసా పారాయణంతో ప్రతీ గృహం శాంతి, సౌభాగ్యాలతో విరాజిల్లు తుందని భగవద్గీత ప్రచార సేవా సమితి అధ్యక్షుడు, సనాతన ధర్మ గీత ప్రచారకులు మల్లిఖార్జునస్వామి అన్నారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని సామర్లకోట పట్టణం లోని చిన్న వీధి రామాలయంలో ఆదివారం నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామనామస్మరణ ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు నేతి వీరభద్రరావు, కార్యదర్శి సత్యకుమార్, ఆలయ కమిటీ సభ్యులు నేతి రమాదేవి, గంద్రేటి త్రిమూర్తులు, విజయనిర్మల, గొర్రెల చిన్నారావు, శారద, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కషాయాలతో పక్కృతి వ్యవసాయం




**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 5 :** ఇరుసుమండలో ప్రకృతి వ్యవసాయం, కషాయాల తయారీలపై ఎంటీ జె.నాగమణి అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగుల నివారణకు కషాయాలను వినియోగిస్తే ఖర్చు ఆదా చేయడమే కాకుండా నాణ్యమైన పంట వస్తుందన్నారు. వేప ఆకులతో గోమాత్రం, పచ్చిమిర్చి, పొగాకు వెల్లుల్లితో కషాయాలను తయారు చేసుకోవాలన్నారు. ఎకరానికి ఒక పంట కాలవ్యవధికి 15 లీటర్ల అగ్నిస్తం సరిపోతుందన్నారు. 15 లీటర్ల గోమూత్రం, 5 కేజీల వేపాకు, కేజీ పచ్చిమిర్చి, కేజీ పొగాకు, అరకేజి వెల్లుల్లిని వినియోగించుకోవాలన్నారు. వీటన్నింటిని సన్నటి మంటపై మరిగించాలన్నారు. చల్లారిన తరువాత వడపోసి 48 గంటలపాటు నిల్వ ఉంచాలన్నారు. ఈ అగ్నిస్తం మూడు నెలలు పాటు నిల్వ ఉంటుందన్నారు. కాండం తొలిచే పురుగు పై బాగా ప్రభావం చూపిస్తోందన్నారు. ఒక ఎకరానికి 100 నీటికి 3 నుండి 5 లీటర్ల కషాయం కలిపి పిచికారి చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్, సత్యశ్యామల లక్ష్మి, ఎం.దుర్గాభవాని, ఎం. సత్యవాణి, డీవీఎన్. మణి, కె. మల్లేశ్వరి, జె.కనకలక్ష్మి పాల్గొన్నారు.

## టిడిపి నేత జాస్తి వసంత్ ఏర్పాటుచేసిన సూపరిపాలన ప్రచార వాహనం ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 6 :** స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్, మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ నూతనంగా తయారు చేయించిన ప్రభుత్వ ఏడాది సుపరిపాలన తొలి అడుగు ప్రచార రథాన్ని ఆదివారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఈ సంవత్సరకాలంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలో సమాన స్థాయిలో ముందుకు నడిపిస్తూ తరుణంలో ప్రజలకు తెలియజేయాలని సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమాన్ని తీసుకుని ఈనెల రెండో తేదీ నుండి 30 తేదీ వరకు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా గడిచిన నాలుగు రోజుల్లోనూ 3,000 మందిని స్వయంగా కలిశామని ఎమ్మెల్యే అన్నారు. ఈ మంచి కార్యక్రమం వల్ల పార్టీకి, ప్రభుత్వానికి ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని ఎంత మంచి కార్యక్రమాన్ని రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, మంత్రి లోకేష్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, రేఖ బుల్లి రాజు, గద్దె అబ్బన్న, బస్వా చినబాబు, చింతమనేని చంటిబాబు,ఉండవల్లి బుల్లి రాజు, ఉమ్మన్ని సుబ్బారావు, చంద్రాల పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించిన టీడీపీ నాయకులు





**ఆత్రేయపురం పెన్ పవర్ జులై 6 :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా,కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో గ్రామ టిడిపి అధ్యక్షులు పెండెం వెంకన్న ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లం రాజు వర్మ, టిడిపి నాయకుడు మెర్ల నాగేశ్వరరావు, కస్టర్ ఇంచార్జ్ కందుల రాంబాబు,బూత్ ఇంచార్జ్ అత్తిలి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు. నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల లోపాలు, ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం, ఇతర స్థానిక సమస్యలను రికార్డు చేశారు. ఈ సర్వే ద్వారా ప్రజల అభిప్రాయాలను పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకునే ఉద్దేశం ఉందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను స్వయంగా చెప్పుకునే అవకాశం లభించిందని, టిడిపి ప్రభుత్వం ప్రజల క్షేమం కోసం పని చేస్తోందని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గూడేల్ల నాగేంద్ర గౌడ, గూడపాటి శ్రీను, ఉలవల కృష్ణ,వి. సత్తిబాబు, వాసంశెట్టి నాగేశ్వరావు, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

## ప్రధాన ఆలయాలకు పోటెత్తిన భక్తులు
## వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** ఆషాఢమాస శుక్ల పక్ష ఏకాదశి తిధి పురస్కరించుకొని సకల శుభాలు కలిగించే తొలి ఏకాదశి పర్వ దినాన్ని పెద్దాపురం పట్టణ, మండలం పరిధిలోని గ్రామాల్లో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్దాపురం పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, కట్టమూరులోని కేశవ పట్టాభిరామ స్వామి వారి దేవాలయం, తిరుపతి శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి ఆలయంతో పాటు పలు దేవాలయాల్లో భక్తులు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున శేషశాయి అయిన లక్ష్మీ నారాయణమూర్తిని స్తుతిస్తే కోటి పుణ్యాల ఫలం లభిస్తుందని ఈ సందర్భంగా పండితులు వివరించారు.

# కుటుంబ కథా చిత్రాల నిర్మాణం ఎంతో అవసరం

## ప్రముఖ రచయిత, దర్శకుడు ప్రతాపరెడ్డి



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** నేటి సమాజంలో యువత పెడత్రోవపడుతున్న నేపధ్యంలో సమాజానికి సాంప్రదాయ, కుటుంబ కథా చిత్రాల నిర్మాణం ఎంతో అవసరమని ప్రముఖ రచయిత, దర్శకుడు భీమవరపు ప్రతాప్ రెడ్డి (హైదరాబాద్) అన్నారు. మండల పరిధిలోని తిరుపతి గ్రామంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి ఆలయంలో ఆయన కో-డైరెక్టర్ మేడపాటి శ్రీనివాసరావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావుతో కలిసి వారు స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ శృంగార వల్లభ స్వామి ఆలయ చరిత్రతో కూడిన సాంప్రదాయ, కుటుంబ కథా చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామన్నారు. 1986లో తాను సినీ రంగంలో అడుగుపెట్టి తమిళన్ గణేష్ హీరోగా నటించిన అప్పటి కథానాయికలు మాధవి, సిల్క్ స్మితలతో కలిసి రుద్రనారి సినిమాలో నటించానన్నారు. విజయశాంతి, చంద్రమోహన్ హీరో హీరోయిన్లగా నటించిన పెళ్ళిచూపులు సినిమాతో పాటు విముక్తికోసం, విప్లవ శంఖం సినిమాలకు దర్శకత్వం వహించానన్నారు. తాను రచయితగా, నిర్మాతగా ప్రధానపాత్ర తండ్రి పాత్రలో నటించిన 'ఓతండ్రి తీర్పు' ఇటీవల 2024 డిసెంబర్ 27వ తేదీన విడుదలై తెలంగాణ రాష్ట్రం అంతటా మంచి ఆదరణ పొందిందన్నారు. త్వరలోనే ఏపీలో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నట్లు ప్రతాపరెడ్డి తెలిపారు. అలాగే వైజాగ్, రాజమహేంద్రవరం, యానాం, తదితర ప్రాంతాల్లో నూతన నటీనటులతో 'రఘు సంకల్పం' చిత్ర నిర్మాణానికి షూటింగ్ లోకేషన్ పరిశీలనకు ఈ ప్రాంతానికి వచ్చి ఈ స్వామి వారిని దర్శించుకునే భాగ్యం కలిగిందన్నారు. త్వరలోనే ఇదే ఆలయంలో షూటింగ్ మూహుర్తపు షాట్ లో రఘు సంకల్పం చిత్రాన్ని నిర్మించనున్నట్లు దర్శకుడు, నిర్మాత ప్రతాపరెడ్డి తెలిపారు. ఆయన వెంట కో డైరెక్టర్ మేడపాటి శ్రీనివాసరావు, నటులు శర్మ, తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మికం ఆరోగ్యప్రదం చాతుర్మాస దీక్ష

## సనాతన ధర్మ గీతా ప్రచారకులు మల్లిఖార్జునస్వామి



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** ఆధ్యాత్మికం ఆరోగ్యప్రదం చాతుర్మాస వ్రత దీక్ష అని సనాతన ధర్మ గీతా ప్రచారకులు మల్లిఖార్జునస్వామి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని స్థానిక సత్తిరెడ్డిపేటలో గల శ్రీభగవద్గీతా నిలయంలో చాతుర్మాస వ్రతదీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునస్వామి భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీమహా విష్ణువు తొలి ఏకాదశి రోజున శేషతల్పంపై యోగ నిద్రలోకి వెళ్తాడని, నాలుగు నెలల తరువాత తిరిగి ఆయన మేలుకొనే కార్తీక శుద్ధ ఏకాదశిని ఉత్థాన ఏకాదశి అంటారన్నారు. ఈ నాలుగు నెలలనూ చాతుర్మాస్యంగా పాటించడం జరుగుతుందని, వ్రతాలన్నీ భగవదానుగ్రహం పొందడానికే అని అయితే వీటిలో చాతుర్మాస్య వ్రతం భిన్నమైనదీ, విశిష్టమైనదని తెలిపారు. ఈ నాలుగు నెలలూ నిరంతర దైవ చింతనలో ఉంటూ, సత్కార్యాలు చేసేవారు భగవదానుగ్రహానికి పాత్రులవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భగవద్గీత ప్రచార సేవా సమితి ఉపాధ్యక్షుడు నేతి వీరభద్రరావు, కార్యదర్శి సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా విష్ణు సహస్ర నామ పారాయణం



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** పెద్దాపురం మండలం ఆనూరు గ్రామంలో గల రమా సహిత సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత ప్రచార సేవా సమితి అధ్యక్షులు, సనాత ధర్మ గీతా ప్రచారకులు మల్లిఖార్జునస్వామి ఆధ్వర్యంలో నారాయణోపనిషత్, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తర శతనామ పారాయణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునస్వామి విష్ణు సహస్ర నామ స్తోత్ర వైశిష్ట్యాన్ని భక్తులకు తెలియచేశారు. మన జీవితంతో ధర్మాన్ని తెలుసుకునేందుకు అవకాశం, శక్తి సరిపోదని, దీనిని సులభంగా తెలుసుకునేందుకు విష్ణు సహస్రనామాన్ని భీష్మాచార్యులు ధర్మరాజుకు వివరించగా మహావిష్ణువు ఆమోదించారన్నారు. ఎవరైతే విష్ణు సహస్ర నామ స్తోత్రాన్ని పారాయణం చేస్తారో వాళ్లు భగవంతుడి సన్నిధికి చేరుతారని, ఇదే ముక్తికి మార్గమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు నేతి వీరభద్రరావు, కార్యదర్శి సత్యకుమార్, కన్వీనర్ కృష్ణదేవ మనోహర్, ఆలయ అర్చకుడు సతీష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు వి.ఎస్.చక్రవర్తి, లలితాదేవి, ఎన్.వి.రమణమూర్తి, హిమజ, యు.సుధీంద్ర పద్మ, ఎన్. రామలక్ష్మి, ఎన్.వి. గోపాలకృష్ణ, సూర్యప్రకాశమ్మ, గోపిరెడ్డి రవి, లలిత, వి. ఆదినారాయణ, వీరకాసులు, పి. సూర్యుడు, నాగమణి, పల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** భక్తులపాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతున్న మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కురం విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో టెంట్లు నిర్మించారు. పలు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు పర్య వేక్షణలో సీఐ పి.విజయ్ శంకర్, ఎస్ఐ వి.మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## బి.జె.పి.అధిష్టానం గుర్తించి ఇద్దరుకు ఉన్నతమైన పదవులు




**వి.ఆర్.పురం పెన్. పవర్.జూలై 6 :** బి.జె.పి.పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అంచ అంచులు గా ఎదుగుతున్న ఎటపాక మండలం బి.జె.పి.పార్టీ గంధం జయమ్మకు బి.జె.పి.అధిష్టానం గుర్తించి మార్కెటింగ్, కమిటీ సభ్యులుగా ఇవ్వడం జరిగింది.కూనవరం మండలానికి చెందిన బి.జె.పి. నాయకులు నోముల సత్యనారాయణ కు బి.జె.పి.అధిష్టానం గుర్తించి సొసైటీ డైరెక్టర్,గా ఉన్నతమైన పదవులు ఇవ్వడం తో ఈ రెండు మండలాల నాయకులు ఇరువురు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వి.ఆర్.పురం మండలం లోని బి.జె.పి. ఒ.బి.సి.జిల్లా ప్రదాన కార్యదర్శి ఐ.వి.వి.ప్రసాద్,బి.జె.పి. మండల మాజీ అద్యక్షులు వెంకట నారాయణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

# లోకేష్ బాబుకు సాదర స్వాగతం..



**రేణిగుంట పెన్ పవర్ జూలై 6 :** నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌కి రేణిగుంట ఎయిర్పోర్ట్‌లో సాదర స్వాగతం పలుకుతున్న జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ బిసి వెల్ఫేర్ మంత్రి సవిత మరియు జిల్లా కలెక్టర్‌గా ఎస్.వెంకటేశ్వర్ తదితరులు.

# రాత్రులే అక్రమ కలప రవాణా ఎందుకు?



**వై రామవరం, పెన్ పవర్,జూలై 6 :** నిబంధనలకు విరుద్ధంగా రాత్రులే అక్రమంగా కలప రవాణా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏ విధమైన కలప రవాణా జరగాలన్న సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరి అని అంటున్నారు. ఏ విధమైన అనుమతులు లేకుండా యథేచ్ఛగా కలప రవాణాను స్మగ్లర్లు చేయలేరని అంటున్నారు. మండల సరిహద్దులు దాటి ఏ విధమైన కటింగ్, రవాణా అనుమతి లేకుండానే యదేచ్ఛగా రాత్రులు తరలిపోతున్నాయని అంటు న్నారు. అటవీ శాఖ ఠాణాల మీదుగా మామూళ్లు చెల్లించి తరలించుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. రైతుల పట్టా భూములలో పెంచిన జామాయిల్ (యూకలిప్టస్) కలపను విఆర్ఓ పర్మిషన్ లేకుండానే ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతానికి తరలిపోతుందని అంటున్నారు. ఏ విధమైన ట్రాన్స్పోర్ట్ పర్మిషన్ ఉన్నా అటవీశాఖ ఠాణా నుండి రాత్రి 8 గంటల దాటితే వెళ్ళరాదనే నిబంధనలు ఉన్నాయని అంటున్నారు. కానీ నిబంధనలన్నీ మామూళ్ల మత్తులో కొట్టుకుపోతున్నాయని, యదేచ్ఛగా కలప రవాణా జరుగుతూనే ఉందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ కలప రవాణాను నిరోధించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

# అమ్మలాంటి ఆయుర్వేదంలో అమృతం దాగి ఉంది

## - సర్వరోగ నివారిణి ఆయుర్వేదమే సంజీవిని



**ఎటపాక,పెన్ పవర్, జూలై 06 :** ఆయుర్వేద వైద్యంలో అమ్మలాంటి అమృత గుణం దాగి ఉందని సర్వ రోగాలకు నివారిణి ఆయుర్వేదమే ఒక సంజీవని అని.పారంపర్య మహా సంఘం తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్ట భువనగిరి జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహించిన నిరంతర సాంప్రదాయ విజ్ఞాన సదస్సు మూడవరోజు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలేరు నియోజకవర్గం శాసనసభ్యులు ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడినారు. తొలుత మహా జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్నారు. భావితరాలకు ఆయుర్వేద వైద్య విద్యార్థులను ప్రోత్సహించండి, సంపూర్ణ ఆరోగ్యం పొందండి. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఎండి జమాల్ ఖాన్, నేటి యాంత్రిక యుగంలో మనిషికి కనీసం ఆరోగ్యాన్ని పట్టించుకునే సమయం కూడా లేకుండా కేవలం ధనార్జన మనుగడ కోసం కాలంతో పరిగెడుతున్నాడు. కానీ కాలయముడిలా మనిషి ఆయుష్షును కబళించేందుకు రోగాల రూపంలో మనిషి వెంటపడి అర్ధశుడుగా చేస్తుంది, మన పూర్వీకుల ఆహార అలవాట్లు అంతమంది పోయినాయి, అందుకే తల్లి గర్భం నుండి మనిషి రోగాలతో భూమిపై వస్తున్నారు, నాణ్యమైన ఆహారం లోపం ప్రతి ఆహారంలో కల్తీ వ్యవసాయ ఉత్పత్తుల్లో రసాయనక ఎరువుల ప్రభావం వీటన్నిటికీ మూలం, నేటి కాలంలో సురక్షితమైన వైద్య అందక అనేకమంది దీర్ఘ రోగాలతో బాధపడుతున్నారని అన్నారు, భావితరాలకు మంచి ఆరోగ్యం కావాలంటే నేడు మనం అరుదైన విలువైన ఔషధ మొక్కలు పెంచి పోషించాలని తెలిపారు, ఈ విజ్ఞాన సదస్సులో సుమారు 100 రకాల ఔషధ మొక్కలను ప్రదర్శన ఏర్పాటు చేశారు, అనంతరం జమాల్ ఖాన్ ను పారంపర్య తెలంగాణ మహా సంఘం నాయకులు శాలువానుక జ్ఞాపికతో పాటు సర్టిఫికెట్ను కూడా అందజేశారు, అలాగే వివిధ రాష్ట్రాల నుండి జిల్లాల నుండి సదస్సుకు వచ్చిన పలువురు సాంప్రదాయ వైద్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.పారాంపర్య వైద్య మహాసంగం తెలంగాణ. ప్రధమ వార్షికోత్సవం సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుండి అనేకమంది ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు. పలువురు ప్రముఖ వైద్యులను గౌరవ సన్మానం నిర్వహించారు. సభాధ్యక్షులుగా యాత్రి మహర్షి, ప్రధాన కార్యదర్శి రామానుజన్ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు సర్జన్ రమేష్, కొండ శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు కేంద్ర కమిటీ సభ్యులు రామడుగు వీరభద్ర చార్యులు, ముఖ్య అతిథులు డి ప్రకాష్, భాను ప్రసాద్, దుర్గారాణి, అరుణావతి, బండి వెంకటేశ్వర్లు, మాచర్ల పద్మారావు, జి హనుమాన్లు, బోర్ర రామారావు, వహిదలి, రామకృష్ణయ్య, ఐల రాజయ్య, బి మోహన్, నెల్లూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసులు, డాక్టర్ రవి ప్రసాద్,ఎండి ఆయుర్వేదిక్, ఏపీ రాష్ట్ర పారం పర్య సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు, కమిటీ కోశాధికారి బాలకృష్ణ, పాల్గొన్నారు.

# జంతువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## పశుసంవర్ధక శాఖ ఏడిఏ డాక్టర్ ఎల్.అనిత




**ఆలమూరు, పెన్ పవర్, జూలై 06 :** జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్ అనిత తెలియజేశారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం తో పాటుగా పెంపుడు జంతువులకు ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని పశు వైద్యశాలల్లో ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్స్ వేశారు. సోమవారం సైతం పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం కొనసాగనుందని అనిత తెలియజేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



**కె గంగవరం పెన్ పవర్ జూలై 6 :** మండల కేంద్రమైన కె గంగవరం గ్రామంలో దంగేరు సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆషాడ మాసం సందర్భంగా గ్రామస్తులు అందరూ కలిపి అమ్మవారి అన్ని రకాల ఫ్రూట్స్,స్వీట్స్ తో సారే సమర్పించారు.అమ్మవారికి సమర్పించిన సారేను భక్తులకు ప్రసాదంగా పంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులందరూ పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం

## - 133 మందికి వైద్య పరీక్షలు




**కాకినాడ, పెన్ పవర్,జూలై 6 :** జర్నలిస్ట్ సంక్షేమమే లక్ష్యంగా కొనసాగుతున్న కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ తన సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. జన్మభూమి పార్కు సమీపంలోని డా. జి. ఓబుల్ రెడ్డి హెల్త్ కేర్ హాస్పిటల్ లో ఈ శిబిరం రెండు విడతలుగా నిర్వహించబడింది.ఈ శిబిరంలో వివిధ ప్రసార, ప్రచార మాధ్యమాలకు చెందిన సుమారు 133 మంది జర్నలిస్టులు, కెమెరామెన్లు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వారంతా విభిన్న వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యంగా ఈసీజీ, 2డి ఎకో, స్కానింగ్, బీపీ, షుగర్, రక్తపరీక్షలు లాంటి పరీక్షలు నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.వైద్య నిపుణులు డా. జి. ఓబుల్ రెడ్డి (గుండె వైద్య నిపుణుడు), డా. మల్లిడి భార్గవి (జనరల్ సర్జన్) తదితరులు పాల్గొని జర్నలిస్టుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. కొద్దిమందికి చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించగా, మిగిలిన వారు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. "విధినిర్వహణతో పాటు ఆరోగ్యం పట్ల జర్నలిస్టులు శ్రద్ధ వహించాలి. ఏ అవసరమైనా మా హాస్పిటల్ తరపున పూర్తిస్థాయి సహాయం అందిస్తాం," అని డా. ఓబుల్ రెడ్డి హామీ ఇచ్చారు.కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి మోహన్, కార్యవర్గ సభ్యులు శిబిరం విజయవంతం కావడానికి తమ సహాయ సహకారాలను అందించారు. హాస్పిటల్ వైద్య బృందాన్ని సత్కరించారు. త్వరలో కంటి వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయనున్నట్లు కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి డెంకాడ మోహన్ తెలిపారు.సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి





**ఆలమూరు, పెన్ పవర్,జూలై 06 :** మండలంలోని జొన్నాడ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తపేట బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిజెపి రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామ నాయకులు, మండల బీసీ నాయకులు కలిసి ఆయనను ఆహ్వానించి ఘనంగా సత్కరించి అభినందించారు. ముందుగా డా. శ్యాం ప్రసాద్ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాకా సత్యనారాయణ మాట్లాడుతూ సమైఖ్య భారత వని కోసం గాను ప్రాణాలర్పించిన త్యాగధనుడు డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కూటమి పార్టీ శ్రేణులందరూ డా.శ్యాం ప్రసాద్ముఖర్జీ ఆశయ సాధన కోసం గాను అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి సీనియర్ నాయకులు తాడి శ్రీనివాస్ రెడ్డి(బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి), రాష్ట్ర గౌడ సంఘం కన్వీనర్ మట్టా వీరబాబు, బీజేపీ జిల్లా టెలికాం నెంబర్ మేడపాటి కృష్ణారెడ్డి,బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా ప్రసాద్, వాకా గోవిందు రాజు, వీరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 06 :** ఆషాడ శుద్ధ ఏకాదశి సందర్భంగా నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశిగా భక్తులు పిలుచుకునే ఈ శయన ఏకాదశి పర్వదినం నాడు అలమూరులోని నారద మహర్షి ప్రతిష్టిత జనార్ధనస్వామి ఆలయ దర్శనం పరమ పావనమని అర్చకులు తెలిపారు. స్వామివారికి అర్చకులు చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## ఘనంగా మాజీ మంత్రి తోట నరసింహం జన్మదిన వేడుకలు



**కిర్లంపూడి, పెన్ పవర్, జులై 6 :** మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ తోట నరసింహం పుట్టినరోజు వేడుకలు కిర్లంపూడి మండలం వీరవరం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. తమ అభిమాన నాయకుడు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని జగ్గంపేట నియోజకవర్గం నలుమూలల నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు కిర్లంపూడి మండలం వీరవరం భారీగా తరలివెళ్లి తోట నరసింహానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నాయకులు శాలువలు కప్పి సన్మానించడమే కాకుండా, కేకులు కట్ చేసి తమ అభిమాన నాయకుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు తోట రాంజీ తన తండ్రి పుట్టినరోజు వేడుకలకు వచ్చిన వారందరినీ సాదరంగా ఆహ్వానించి అల్పాహార విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు, జగ్గంపేట నియోజకవర్గం నలుమూలల నుండి వైసిపి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి నరసింహానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు




**కె గంగవరం పెన్ పవర్ జులై 6 :** కే గంగవరం మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఏకలవ్య జయంతి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎరుకల ఏకలవ్య యూత్ మండల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ముందు వచ్చే తొలి ఏకాదశి రోజున ఏకలవ్య జయంతిని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా మహాభారతంలో ఏకలవ్య పాత్ర,అతని ధైర్యసాహసాలు, గురుభక్తి గురించి వివరణాత్మకంగా ప్రసంగించారు.జయంతి కార్యక్రమంలో యూత్ మండల ప్రెసిడెంట్ బి. గోవిందు, సెక్రటరీ ఎస్. రాజు, వైస్ ప్రెసిడెంట్ ఏ. రాంబాబు, వివిధ మండలాల నుంచి వచ్చిన ఎరుకల యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పెదపళ్ళ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు

### ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సలాది



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 06 :** కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఆలమూరు మండలం క్లస్టర్10 లోతెలుగుదేశం నాయకులు సలాది నాగేశ్వరరావు సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛను మొత్తాన్ని ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచిన అంశాన్ని లబ్ధిదారులకు వివరించారు. ఒకేసారి రూ. 7వేల పింఛన్ అందజేసిన విధానం అలాగే నెలనెలా ఠంచనుగా రూ. 4 వేల పింఛన్ అందజేస్తున్న అంశాన్ని వారికి వివరించారు. తల్లికి వందనం పథకంతో ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు జమ చేసిన విషయాన్ని తెలియజేశారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాలు అమలు చేయనున్నట్లు వారికి వివరించారు. ఇప్పటికే అందిస్తున్న ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం వల్ల గృహిణులకు లభిస్తున్న ఆర్థిక భరోసా గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం నుంచి అందాల్సిన ఏదైనా పథకం గురించి సందేహం వస్తే క్లస్టర్ ఇన్చార్జికి తెలియజేయాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కూటమి పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

### విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో

## విష్ణు ఆలయంలో ప్రత్యేక భక్తి గీతాల పారాయణం





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6 :** ఏలేరు నది తీరాన ఉన్న శ్రీ విష్ణు ఆలయంలో ప్రత్యేక గీతాల పారాయణ కార్యక్రమం భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. హిందువులు ఎంతో విశిష్టమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అన్నవరం సత్యనారాయణ స్వామి దత్తత ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరీటి బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విష్ణు సహస్ర నామాల స్తోత్రం, భగవత్ గీతా పారాయణం, హనుమాంచాలీసా , భక్తి గీతాలు పారాయణ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో పలు మహిళా భక్తి సమాజ నారీమణులు గిరిజ, మంగమణి, దేవి, కుమారి, కామాక్షి, శారద, స్వరాజ్యం, హైమావతి, అనురాధ, రామాదేవి తో పాటు భక్తి సమాజానికి చెందిన భక్తులు పాల్గొని భజన కార్యక్రమాలను నిర్విఘ్నంగా కొనసాగించారు. అలాగే తొలి ఏకాదశి సందర్భంగా స్థానికంగా ఉన్న పలు రామాలయాల్లో ఏకాహం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శివాలయాలు, శ్రీకృష్ణ ఆలయం, సాయిబాబా మందిరాల్లో భక్తులు తెల్లవారుజామునే పుణ్య స్థానాలు ఆచరించి ఆలయాలకు క్యూ కట్టారు. దిబ్బల పాలెం చందన రెండో రామాలయాల వద్ద రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు ఏకాహం కార్యక్రమంలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైబ్రరీ వద్ద గల రామాలయం వద్ద మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. నెయిలి పేట రామాలయం వద్ద నిర్వహిస్తున్న ఏకాహం కార్యక్రమంలో పలు భక్తి సమాజాలు పాల్గొని గీతాలాపన చేస్తున్నారు.

## జనసేన నిత్యవసర వస్తువులు పంపిణీ



**అమలాపురం/ ముమ్మిడివరం. పెన్ పవర్ జూలై 6 :** పెరాలసిస్ స్ట్రోక్ తో బాధపడుతూ చికిత్స పొందుతున్న ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన కొప్పిశెట్టి తాతారావు ను పరామర్శించి మమ్మిడివరం జనసేన నాయకుల సహకారంతో 5000/ ఆర్థిక సాయం ను వానపల్లి పాలెం గ్రామానికి చెందిన నల్లా బాబి దంపతుల సహకారంతో నిత్యవసర వస్తువులను జనసేన నాయకులు అందచేశారు.ఈ కార్యక్రమంలో గోదశి పుండరీష్,దూడల స్వామి,బద్రి రమా, యలమంచిలి బాలరాజు, గుద్దటి విజయ్,గాలిదేవర బుల్లి, సూరపురెడ్డి సురేష్,మాదాల శ్రీధర్,కొప్పిశెట్టి బాబీ, వంగ సీతారాం,కర్రి శ్రీను, కొప్పిశెట్టి రామన్న తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు మృతుల కుటుంబాలకు రూ 31 లక్షల విరాళం






**ఆలమూరు, పెన్ పవర్,జూలై 06 :** విధి నిర్వహణలో కారులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆలమూరు ఎస్సై ఎం,అశోక్, కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్ కుటుంబాలకు రూ 31 లక్షల ఆర్థికసాయం వితరణ జరిగింది. 2009లో అప్పటి ఉమ్మడి (ఆంధ్రా, తెలంగాణ) రాష్ట్రంలో ఎస్సైలుగా నియమితులైన సుమారు 1100 మంది ఈవిరాళాన్ని సమకూర్చుకున్నారు. అందులో భాగంగా ఎస్సై అశోక్ నివాసమైన పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం వెళ్లి కుటుంబసభ్యులకు రూ 26 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఎస్సై అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే ఆలమూరులోని కానిస్టేబుల్ బ్లెస్సన్ నివాసానికి వచ్చి అతని కుటుంబసభ్యులకు రూ ఐదు లక్షల చెక్కును అందజేశారు. అనంతరం కానిస్టేబుల్ బ్లెస్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కర్తవ్య నిర్వహణలో మృతి చెందిన తమ సహచర ఉద్యోగులైన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ రుణం ఎన్నటికీ తీర్చుకోలేదని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ వ్యాఖ్యానించారు. మృతుల కుటుంబాలకు తమ వంతు సాయంగా ఈవిరాళాన్ని అందించినట్లు వివరించారు.

## రవికుమార్ ఆధ్వర్యంలో జగజ్జీవన్ రామ్ వర్ధంతి



**మండపేట. పెన్ పవర్. జూలై 6 :** మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 39 వ వర్ధంతిని వైసీపీ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జాతీయ నాయకుల సెంటర్లోని డా. బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత తొలి కార్మిక మంత్రిగా జగజ్జీవన్ రామ్ దేశంలో అనేక కీలక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. హరిత విప్లవంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా ఆయన అందించిన సేవలు దేశ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని చెప్పారు. జాతిపిత మహాత్మా గాంధీ అభిప్రాయాలను సమర్థిస్తూ, అణకువతో ఆయన ప్రయత్నాల్లో పాల్గొని అంటరానితన నిర్మూలనకు కృషి చేశారని పేర్కొన్నారు. 1936 నుండి 1986 వరకు 50 సంవత్సరాల పాటు నిరంతరాయంగా పార్లమెంట్ సభ్యుడిగా ప్రపంచ రికార్డు సాధించారని, ఉపప్రధానిగా, 1971 భారత్ పాకిస్తాన్ యుద్ధంలో రక్షణ మంత్రిగా అత్యంత సమర్థంగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ జొన్నపల్లి సత్తిబాబు, యర్రగుంట అయ్యప్ప, యరమాటి వెంకన్నబాబు, యర్రగుంట అయ్యప్ప, అందనాపల్లి రవి, రమేష్, శీలి సత్యనారాయణ, చిన్ని విజయ్, దుగ్గిరాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాపారాయుడు జన్మదిన వేడుకలు



**మండపేట. పెన్ పవర్.జూలై 6 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం అర్తమూరులోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో అభిమానులు, పార్టీ నాయకులు పాల్గొని పాపా రాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయనను శాలువాలతో సత్కరించి ఇటువంటి పుట్టిన రోజులు ఎన్నో జరుపుకోవాలని, భగవంతుని ఆశీర్వాదంతో ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని ఆదర్శ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పేదలకు అన్నదానం నిర్వహించారు. పాపారాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి తోట త్రిమూర్తులు నాయకత్వంలో అందరూ కృషి చేయాలని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలన్నది మన సంకల్పమని పేర్కొన్నారు. తోట త్రిమూర్తులు మండపేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలవాలని, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, జడ్పిటిసి కుడుపూడి భవాని, రాంబాబు సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, పెంకే గంగాధరం, సూరంపూడి సత్యప్రసాద్, ఎంపీటీసీలు అడ్డాల శ్రీదేవి రామరాజు, పంపన లక్ష్మీ పద్మారావు, సీనియర్ నాయకులు వల్లూరి రామకృష్ణ, సాధనాల శివ భగవాన్, పమిడిపల్లి నానాజీ, వాసంశెట్టి శ్రీనివాస్, పైడిమల్ల రాజు, ఖండవెల్లి చిన్నరాజు, ఖండవెల్లి నవ్య తేజ, దాకమరి ప్రసాద్, తమలంపూడి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం





**అమలాపురం, పెన్ పవర్ జూలై 6 :** సఖినేటిపల్లి మండలం , అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు తొలి ఏకాదశి సందర్భముగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కటకటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు శ్రీ స్వామి ని దర్శించుకున్నారు. శ్రీ స్వామి వారి సన్నిదిలో ప్రతి నిత్యం నిర్వహించే శ్రీ నారసింహ సుదర్శన హెూమం నందు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ,తీర్ద ప్రసాదములు స్వీకరించారు. తదనంతరం శ్రీ స్వామి వారి ఆలయములో అత్యంత ప్రాచుర్యం పొందిన నిత్యాన్నదానం నందు సుమారు 6,000 మంది శ్రీ స్వామి వారి అన్నప్రసాదము స్వీకరించారు. ఈ కార్యక్రమములలో భక్తులకు ఏవిదమైన అసౌకర్యములు కలగకుండా , క్యు లైన్ , మంచినీటి సదుపాయం తదితర ర్పాట్లు ఆలయ సిబ్బంది చేసియున్నారు. శ్రీ స్వామి వారి ప్రసాద విక్రయములు , ప్రత్యేక దర్శనములు , వివిధ సేవల ద్వారా రూ. 2,74,791/- లు మరియు అన్నదాన ట్రస్ట్ విరాళముల ద్వారా రూ. 1,38,928/-లు వెరశి మొత్తం రూ. 4,13,719/- లు ఆదాయం వచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## వేటమామిడిలో వాహనాలు తనిఖీ..





**అడ్డతీగల, పెన్ పవర్ ,జూలై 06 :** ఆదివారం అడ్డతీగల మండలం వేటమామిడి జంక్షన్లో అడ్డతీగల సిఐ బి నరసింహమూర్తి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ప్రతి ఒక్క వాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు, ప్రతి ఒక్క వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ వాహన పత్రాలను కలిగి ఉండాలని అలా లేనియెడల అపరాధ రుసుము విధించడం జరుగుతుందని వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉన్న యువతకు గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించడం వలన వచ్చే అనారోగ్య సమస్యల గురించి వివరిస్తూ, మత్తు పదార్థాలు విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి పండించిన అమ్మడానికి ప్రయత్నించిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహమూర్తి తెలిపారు.

## రాష్ట్రంలో అనంతపురం మొదటి స్థానంలో నిలవాలి

### కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి




**అనంతపురం, పెన్ పవర్ జూలై 06 :** మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ 2.0ని రికార్డు సృష్టించేలా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమంపై అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఎఫ్ఓ విగ్నేష్ అప్పావు, డీఈవో ప్రసాద్ బాబు, డివిఈఓ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డ్వామా పిడి సలీమ్ భాష, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిఎస్ఓ, ఎంఈఓలు, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ 2.0 ని ఆదర్శవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ సత్యసాయి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని, జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంతో పాటు తల్లికి వందనం పథకం కింద డబ్బు జమ కావడం జరిగిందని, త్వరలో ఎవరెవరికి ఇంకా డబ్బులు అందించాల్సి ఉందో ఆ ప్రక్రియలో ఉన్నామన్నారు. మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ గురించి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేయగలరు. గతేడాది జిల్లాలోని అందరి సహకారంతో మెగా పీటీఎంని నిర్వహించామని, ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ జూలై 10న రికార్డు నమోదు చేయించేందుకు ఈ మెగా పీటీఎంను నిర్వహించాలన్నారు. పిల్లల చదువులో అందరు భాగస్వామ్యం ఉండాలని, పిల్లలు, తల్లిదండ్రులు, టీచర్లు, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీలు, దాతలు, ప్రజాప్రతినిధులు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని, ఈ కార్యక్రమం అయ్యాక డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమం ఈ సారి ప్రభుత్వ ప్రైవేటు, ఆన్ ఎయిడెడ్ పాఠశాలలోనే కాదు అన్ని ఇంటర్మీడియట్ కళాశాలలో కూడా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 30 సెకండ్ల వీడియో క్యాప్చర్ చేయాలని, మూడు ఫోటోగ్రాఫ్ లు తీసుకోవాలని, వాటిని లీప్ యాప్ లో అప్లోడ్ చేయాలని, ఎస్ఓపి ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎలాంటి హడావిడిగా కాకుండా ఒక స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని ఎంఈఓలు నిర్వహించాలని, ఇందుకు సంబంధించి ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లకు తెలియజేసి కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బందిని నియమించాలని వారు పూర్తి కార్యక్రమ నిర్వహణ వివరాలు అన్నీ యాప్ లో అప్లోడ్ అయ్యాయా అని వెరిఫై చేసి సాక్షిగా వ్యవహరిస్తారని, ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం వరల్డ్ రికార్డు చేయడానికి డేటా ఎంట్రీ, ఎవిడెన్స్ క్రియేట్ చేయడానికి ఎంపిడివోలు తగిన బాధ్యత వహించాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ ఒక పోలీసు ఉండాలని, సే నో టు డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కలిగించాలని అన్నారు.

**కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి :** మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ 2.0కి సంబంధించి కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఇంచార్జిగా అసిస్టెంట్ కలెక్టర్ ఉంటారని, అడిషినల్ ఇంచార్జిగా సమగ్ర శిక్ష ఏపిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంపై జిల్లా, మండల, పాఠశాల స్థాయిలో ఏర్పాట్లపై ముందస్తు సమావేశాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ – మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం కింద నాటాలని, ప్రతి ఒక్క పిల్లలకు ఒక గ్రీన్ పాస్పోర్ట్ ఇస్తారని, ఏ రోజు ఏ మొక్క నాటారు, దానికి సంబంధించిన సెల్ఫీ పాస్పోర్ట్ కు అతికించాలని, ఇందుకు సంబంధించి లీప్ యాప్ లో వివరాలను అప్లోడ్ చేయాలని, అపార్ ఐడిని అప్లై చేసి వివరాలు నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహనలో రాష్ట్రంలో అనంతపురం జిల్లా మొదటి స్థానంలో నిలవాలన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్లో చివరగా మొక్కలు నాటాలని, పిల్లల చేత మొక్కలు నాటించాలని ఇందుకు సంబంధించిన మొక్కలను పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 2.50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించడం జరిగిందని, కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం గురించి ముందుగా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమం జరిగే రోజు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్వోని ఆదేశించారు. ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సాక్ష్యల పట్ల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు బాధ్యతగా ఉండాలన్నారు. మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ కి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో సమగ్ర శిక్ష ఏపిసి, డిఇఓ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్క పిల్లలు కొత్త యూనిఫామ్, షూస్ తో ఈ కార్యక్రమానికి హాజరయ్యాలా కిట్స్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## రాబోయే స్థానిక ఎన్నికల్లో వైసీపీ విజయం ఖాయం

### - వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా





**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 5:** రాష్ట్రంలో ప్రజలను నమ్మించి బూటకపు హామీలు ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని కాకినాడ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. ఆదివారం జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో ఉన్న సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ లో జగ్గంపేట నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి సమావేశం మాజీ మంత్రి, వైసీపీ ఇన్చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దాడిశెట్టి రాజా హాజరై ప్రసంగించారు. రేపటి నుంచి గ్రామంలోని ప్రతి గడపకు తిరిగి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అందాయా లేదా అని అడిగి తెలుసుకోవాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వైసిపి విజయం ఖాయమన్నారు. రాబోయే ఎన్నికల్లో తోట నరసింహంను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం వైసిపి యువ నాయకులు తోట రాంజీ మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలోని ప్రస్తుత ఎమ్మెల్యే నాలుగుసార్లు గెలిచారని, తన తండ్రి తోట నరసింహం మంత్రిగా, పార్లమెంట్ సభ్యులుగా, వివిధ పదవుల్లో పని చేశారని గుర్తు చేశారు. అనంతరం ఇంచార్జి నరసింహం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా బాబు సూరిటీ మోసం గ్యారంటీ అనే దాని గురించి వివరించారు. అనంతరం తోట నరసింహం పుట్టినరోజు సందర్భంగా అభిమానుల నడుమ భారీ కేకును కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా పరిశీలకులు దాట్ల సూర్యనారాయణ రాజు, కాకినాడ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఒమ్మి రఘురాం, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు, జగ్గంపేట మండలం అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, నాలుగు మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకినాడలో స్పా, సెలూన్ కేంద్రాలపై పోలీసుల ఆకస్మిక దాడులు





**కాకినాడ, పెన్ పవర్, జూలై 6 :** కాకినాడ నగరంలోని స్పా కేంద్రాలు, సెలూన్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనుమతిలేకుండా నిర్వహించబడుతున్న కేంద్రాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ దాడులు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు చేపట్టారు. ఈ తనిఖీలను కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ మనీష్ దేవరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ 1–టౌన్, 2–టౌన్, 3–టౌన్, పోర్ట్, సర్పవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని సెలూన్లు, స్పా కేంద్రాలు పరిశీలించబడ్డాయి.

పోలీసులు అనుమతులు లేని స్పా సెంటర్లలో జరుగుతున్న చట్ట విరుద్ధ కార్య కలాపాలను అడ్డుకుని, సంబంధిత యజమానులపై తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు పోలీసుల దాడులను సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## తొలి ఏకాదశి సందర్భంగా కేశవ స్వామికి విశిష్ట పూజలు







**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 6 :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో నిండి భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తమ భక్తిశ్రద్ధలతో విరాళాలను సమర్పించారు. విశాఖపట్నం నగరానికి చెందిన పూసపాటి ఈశ్వర వర్మ–రాణి దంపతులు రూ. 5,116 విరాళంగా సమర్పించగా, పెద్దాపురం నికి చెందిన కమిడి వెంకట సత్యనారాయణ–వెంకటరమణ దంపతులు కూడా రూ. 5,116 విరాళంగా అందజేశారు. విరాళ దాతలను ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలతో దీవించారు. అనంతరం ఆలయ అధికారి ఏ. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, చరిత్ర కలిగిన పుస్తకం శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం భక్తి, నమ్మకం, సేవా భావాలను ప్రతిబింబిస్తూ ఆలయ సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. విరాళాల రూపంలో భక్తులు చూపిన ఆదరణ ఆలయ అభివృద్ధికి అండగా నిలుస్తుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

## కూటమి పాలనతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి

### -బూరుగుపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై6 :** కూటమి పాలనతోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధిస్తుందని టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పాఠంశెట్టి మురళీకృష్ణ, టిడిపి సీనియర్ నేతలు కుంచే తాతాజీ, బూరుగుపూడి మాజీ ఎంపీటీసీ పాఠంశెట్టి రవి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల, తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ పర్యవేక్షణలో కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో ఆదివారం టిడిపి శ్రేణులు ఆధ్వర్యంలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగుపూడి గ్రామం లో టిడిపి శ్రేణులు ప్రజలు వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ సంక్షేమ పథకాలు అందుతున్నాయా,లేదో తెలుసుకుని టిడిపి మై యాప్ లో నమోదు చేశారు. ఎక్కువగా గ్యాస్ సిలిండర్ల సొమ్ము లు పడలేదని చెప్పడంతో వాటిని నమోదు చేశారు. ఇంటింటా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫిషర్ మేన్ సొసైటీ అధ్యక్షుడు మూరా సత్తిబాబు, కర్ణాకుల పెద్దకాపు, పాటంశెటి కొండ్రాజులు, పాటంశెటి నాగేశ్వరరావు, బుజ్జి,తమ్మారావు, రాంబాబు, బార్కుల చిన్నోడు, రామిశెటి రాజు పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదిమందిని గాయపరిచిన పిచ్చికుక్క



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,జూలై 6 :** జీలుగుమిల్లిలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో పదిమంది గాయాల పాలయ్యారు. తీవ్ర గాయాలు పాలైన వారిని జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 9 మందిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామస్తులు పిచ్చి కుక్కను హత మార్చారు. అక్కడ సరైన చికిత్స అందించడం లేదని పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు దృష్టికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారిని ఎమ్మెల్యే పరామర్శించారు.

## గంగవరంలో విస్తృతంగా వాహనాల తనిఖీ

### రికార్డులు సక్రమంగా ఉండాలి ఎస్సై వెంకటేష్





**గంగవరం, పెన్ పవర్, జూలై 6 :** గంగవరం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పోలీస్ సిబ్బంది విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనదారులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలని రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు నూతన మోటర్ వెహికల్ చట్టం ప్రకారం పెనాల్టీలు విధించడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు యువత రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, మైనర్ బాలురకు వాహనాలు డ్రైవింగ్ ఇచ్చిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట గంగవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏఎంసీ చైర్మన్ పదవి కోసం రెండో జాబితా అధిష్టాన పరిశీలనలో

## సాయిబాబు పేరుకు మద్దతు పెరుగుతోంది



**కాకినాడ, పెన్ పవర్,జూలై 6 :** ఏఎంసీ చైర్మన్ పదవి కోసం తెలుగుదేశం పార్టీ అధిష్టానం వద్ద రెండో జాబితా పరిశీలనకు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ జాబితాలో రామచంద్రపురం కు చెందిన అక్కల రిశ్వంత్ రాయ్ (తెలుగు యువత ఉపాధ్యక్షుడు), వెల్ల గ్రామానికి చెందిన ఆకుల నారా యణరావు పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏఎంసీ చైర్మన్ ఎవరవుతారనే దానిపై సర్వత్ర చర్చ మొదలైనది. ఇప్పటికే తొలి విడతగా కొన్ని పేర్ల జాబితాను పార్టీ అధిష్టానం పరిశీలనకు పంపించగా, వివిధ కారణాలతో ఆ జాబితా పక్కన పెట్టి, మరో జాబితా రూపొందించాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో ఇటీవల రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ సుదీర్ఘంగా సీనియర్ నాయకులతో చర్చలు జరిపి రెండో జాబితాను అధిష్టానానికి పంపినట్లు తెలిసింది. అదే సమయంలో కాజులూరు మండలం బంధనపూడి గ్రామానికి చెందిన సలాది సాయిబాబు కూడా ఏఎంసీ చైర్మన్ పదవికి గట్టి పోటీలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. సాయిబాబు కుటుంబం ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో సేవలందించిందని, ఆయన తాతయ్య, తండ్రి మొదలుకొని పార్టీ కోసం శ్రమించిన వారని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. సాయిబాబు గతంలో ఎంపీటీసీ అభ్యర్థిగా, మండల టీడీపీ అధ్యక్షుడిగా సేవలు అందించిన సీనియర్ నాయకుడు. ప్రస్తుతం ఏడవ క్లస్టర్ ఇన్ఛార్జి గా కొనసాగుతున్నారు. ఏఎంసీ చైర్మన్ పదవి కోసం సాయిబాబు పేరును కూడా పరిశీలనకు పంపాలని కాజులూరు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు కోరుతున్నట్టు సమాచారం. చైర్మన్ పదవి కోసం అభ్యర్థుల ఎంపికలో సీనియారిటీ, పార్టీలో అంకితభావం, విస్తృతమైన సేవా చరిత్ర కీలకంగా పరిగణనలోకి తీసుకోవాలని కార్యకర్తలు ఆశిస్తున్నారు.

## తాళ్లపాక శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామివారి ఆలయాల్లో వైభవంగా ధ్వజారోహణం



**తిరుపతి పెన్ పవర్ జూలై 6 :** టిటిడికి అనుబంధంగా ఉన్న అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు.

**శ్రీ సిద్ధేశ్వరస్వామివారి వాహనసేవలు :** శ్రీ సిద్ధేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం ఉదయం 06.16 గం.లకు ధ్వజారోహణంను చేపట్టారు. సాయంత్రం 06 గం.లకు హంసవాహన సేవపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి రోజూ ఉదయం 08.00 గం.లకు, సాయంత్రం 06.00 గం.లకు వాహన సేవలు జరుగనున్నాయి. జూలై 11న సాయంత్రం 6.00 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.300/– చెల్లించి ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. జూలై 14న ఉదయం 10.00 – 12.00 గంటలకు వసంతోత్సవం, త్రిశూలస్నానం, సాయంత్రం 05.00 – 06.00 గం.ల మధ్య ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. జూలై 15వ తేదీన ఉదయం 09.00 గం.లకు స్నపన తిరుమంజనం, రాత్రి 06.00 – 08.00 గం.ల మధ్య పుష్పయాగం చేపడుతారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ బాబూ జగజ్జీవన్‌రామ్

- ఆయన ఆశయాలను ఆచరణలో చూపుతున్న వైయస్‌ఆర్‌సీపీ
- పాలనలో బడుగువర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన వైయస జగన్
- దళితుల పట్ల విషం చిమ్ముతున్న చంద్రబాబు కూటమి సర్కార్: వైయస్‌ఆర్‌సీపీ నేతలు
- వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ వర్థంతి, ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన పార్టీ నేతలు



**తాడేపల్లి: జులై 06. పెన్ పవర్.** వైయస్‌ఆర్‌సీపీ కేంద్రం కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా దేశానికి ఆయన అందించిన సేవలను శ్లాఘించారు. కేంద్ర ప్రభుత్వంలో పలు శాఖల్లో తన పనితీరుతో ఆయన తనదైన ముద్రను వేశారని కొనియాడారు. ఈ దేశంలో అసమానతలను రూపుమాపాలన్న లక్ష్యంతో తన జీవితాంతం జగజ్జీవన్ రామ్ చేసిన కృషి నేటికీ అనుసరణీయం అని అన్నారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఏం మాట్లాడారంటే....

**జగజ్జీవన్‌రామ్ కోరుకున్న సమాజానికి బాటలు వేసిన వైయస్ జగన్ : పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి**

ఈ రోజు ప్రజా స్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతిని ఘనంగా జరుపుకుంటున్నారు. గతంలో సీఎంగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి, గత అయిదేళ్ళలో సీఎంగా వైయస్ జగన్ పాలనను చూస్తే ఎంతగా జగజ్జీవన్‌రామ్ వంటి మహనీయులు కోరుకున్న సమాజాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేశారో అర్థమవుతుంది. ఆనాడు బాబూ జగజ్జీవన్ రామ్ దేశంలోనే అత్యంత సమర్థ నాయకుడుగా అనేక శాఖలను పర్యవేక్షించడం ద్వారా తన పాలనకే వన్నె తీసుకువచ్చారు. నిత్యం ఆయన సమాజంలో మార్పు రావాలని కోరుకున్నారు. ఆ మార్పును ఈ రాష్ట్రంలో వైయస్ జగన్ తన పాలనలో ఆచరణలో చూపించారు. నేడు అధికారంలో ఉన్న చంద్రబాబు వంటి వారు దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ బడుగు వర్గాలను కించపరిచేలా మాట్లాడారు. అటువంటి వారు కూడా దురదృష్టవశాత్తు నేడు పదవుల్లో ఉండి, జగజ్జీవన్ రామ్ పేరు స్మరిస్తున్నారు. నిజంగా వారికి ఆ మహనీయుడి పేరు ఉచ్ఛరించే అర్హత కూడా లేదు. ఈ దేశంలో అనేక మంది సీఎంలుగా పనిచేశారు. కానీ చంద్రబాబు వంటి నీచమైన మనస్తత్వం ఉన్న సీఎంను ఎక్కడా చూడలేదు. పేదరికంలో ఉన్న అణగారిన వర్గాలపై ఆయనకు ఉన్న చులకన భావం పలు సందర్భాల్లో వెల్లడించారు. అసమానతలను లేని సమాజాన్ని చూడాలంటే తిరిగి వైయస్ జగన్ పాలనను తెచ్చుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.

**దళిత సమాజం చంద్రబాబును క్షమించదు: మాజీ ఎమ్మెల్యే, వైయస్‌ఆర్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు**

ఈ దేశంలో దళితులను, అణగారిన వర్గాలను అభివృద్ది వైపు నడిపించాలని బాబూ జగజ్జీవన్‌రామ్ వంటి మహనీయులు కృషి చేశారు. అటువంటి దేశంలోనే నేడు ముఖ్యమంత్రి వంటి పదవుల్లో ఉంటూ దళితులకు కనీసం ఒక మనిషిగా ఇచ్చే గౌరవం కూడా ఇవ్వని చంద్రబాబు వంటి వారు పాలన సాగిస్తున్నారు. కులాల మధ్య అంతరాలు తొలగించాలని, ఒక మంచి సమాజాన్ని సృష్టించాలని ఆనాడు జగజ్జీవన్ రామ్, అంబేద్కర్ వంటి వారు కాంక్షించారు. కానీ ఏపీలో దురదృష్టవశాత్తు చంద్రబాబు వంటి అహంకారపూరిత నేతల పాలనలో దళిత సమాజం ప్రతిరోజూ అవమానాలను ఎదుర్కొంటూనే ఉంది. ఆయన కేబినెట్‌లో పనిచేసిన వారు సైతం దళితుల పట్ల ఎంత నీచంగా మాట్లాడారో ప్రజలు అందరూ చూశారు. నిన్నకాక మొన్న దళితుడైన సింగయ్యను కుక్కతో పోల్చిన చంద్రబాబును దళిత సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించదు. తన పాలనలో దళితుల ఆత్మ గౌరవాన్ని పెంచేందుకు, వారిని సమాజంలో అందరితో పాటు సగౌరవంగా నిలబెట్టేందుకు సీఎంగా వైయస్ జగన్ ప్రయత్నించారు. దళితులు గొప్ప చదువులు చదివేందుకు, ఉన్నత స్థానాల్లో నిలబడేందుకు వారికి అండగా నిలిచారని టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు.

**రాష్ట్రంలో బడుగుల హక్కులను కాలరాస్తున్న చంద్రబాబు : మాజీ మంత్రి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున**

దళిత జాతుల కోసం అవిరళంగా కృషి చేసిన బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన ఈ దేశానికి చేసిన సేవలను అందరూ స్మరించుకుంటున్నారు. ఈ దేశంలో ఎక్కువ పోర్ట్ పోలియోలను సమర్థంగా నిర్వహించి, తన సామర్థ్యంతో ఈ దేశానికి గొప్ప సేవలు అందించిన నాయకుడు జగజ్జీవన్‌రామ్. ఈ దేశంలోని బడుగుల గురించి ఆలోచించిన నేత. సమాజంలో అసమానతలను రూపుమాపాలని ఆయన జీవితాంతం కృషి చేశారు. ఆయన అడుగుజాడల్లో, ఆయన ఆశయాలకు అనుగుణంగా పరిపాలనను ఈ రాష్ట్రానికి అందించిన ఘనత వైయస్ రాజశేఖర్‌రెడ్డి, తరువాత వైయస్ జగన్‌కే దక్కుతుంది. కులం, మతం, ప్రాంతం, వర్గం అనే భేదాలు లేకుండా ఈ రాష్ట్రంలో పేదరికం నుంచి ప్రతి ఒక్కరినీ విముక్తులను చేసేందుకు అయిదేళ్ళ పాలనలో వైయస్ జగన్ చిత్తశుద్ధితో కృషి చేశారు. నేడు చంద్రబాబు పాలనలో అణగారిన కులాలు మళ్ళీ చీకటిరోజుల్లోకి వెళ్ళిపోతున్నాయి. బడుగు వర్గాలకు అందించాల్సిన అన్ని పథకాలను రద్దు చేయడం, వారి హక్కులను కాలరాయాడం ద్వారా రాక్షస పాలనను సాగిస్తున్నారు. ఇటీవల సత్తెనపల్లిలో చనిపోయిన దళితుడు సింగయ్యను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కుక్కతో పోల్చడం సిగ్గుచేటు. ఇదీ ఆయనకు దళితులంటే ఉన్న చులకన భావం. ఇటువంటి పాలనకు చరమగీతం పాడేందుకు బడుగువర్గాలు ఐక్యం కావాలి.

**జగజ్జీవన్‌రామ్ ఆలోచనలను కొనసాగించిన నేతలు వైయస్‌ఆర్, వైయస జగన్ : మాజీ ఎంపీ నందిగం సురేష్**

ఈ దేశానికి ఉప ప్రధానిగా, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాంంత కృషి చేసిన మహనీయుడు బాబూ జగజ్జీవన్‌రామ్. ఆయన ఆశయాలను ఆచరణలో చూసిన వారు ఆనాడు మహానేత స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి అయితే నేడు మాజీ సీఎం వైయస్ జగన్. ఈ రాష్ట్రంలో అణగారిన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా ప్రగతివైపు నడిపించిన నాయకులు వారు. నేడు కూటమి పాలనలో ప్రతిరోజూ బడుగు, బలహీనవర్గాలపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, వారికి అండగా నిలుస్తున్న నాయకుడు వైస్ జగన్. గతంలో ఇందిరాగాంధీ హయాంలో ప్రజలు చూసిన ఎమర్జెన్సీని తిరిగి ప్రజలు చంద్రబాబు పాలనలో చూస్తున్నారని మాజీ ఎంపీ నందిగం సురేష్ అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, పార్టీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి, తాడేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ వేమారెడ్డి, స్టేట్ స్పోక్స్ పర్సన్ వేల్పుల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు.





- ఇంటింటికి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.
- రాష్ట్ర ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి.

**గుమ్మలక్ష్మీపురం జులై 06. పెన్ పవర్.** కురుపాం నియోజకవర్గం, కొమరాడ మండలం,కొత్త, పాత మర్కొండపుట్టి గ్రామాల్లో ఆదివారం నాడు జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి,ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలతో గడప గడపకు తిరిగి పథకాలపై ప్రజలకు అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం రాష్ట్ర మంత్రివర్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలందరు ఆనందం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర ప్రజలకు పునర్నిర్మాణ యుగం ప్రారంభమైంది అని అన్నారు.ప్రజల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన జీవన స్థితిని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలుగుదేశం పార్టీ ప్రజల సంక్షేమం కోసం,ముఖ్యంగా రైతులు,మహిళలు,యువత మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడం కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఆమె అన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంటిలోకి వెళ్లి గడపగడపకూ చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని చాటి చెప్పారు.గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన నష్టంతో పాటు ఏడాది కాలంలోనూ ప్రజలు మెచ్చిన పాలన అందించామని వివరించారు. అత్యధిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా తల్లికి వందనం కింద గతంలో ఒక్కరికే రూ.15 వేలు చెల్లిస్తే,ఇప్పుడు ఇద్దరికి మించి పిల్లలున్న వారందరికి రూ.30 నుంచి 60వేల వరకు తల్లి ఖాతాలో జమ చేసిన విషయాన్ని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొద్దిరోజుల వ్యవధిలోనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు అండగా నిలవడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్ర దేవ్,ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య,నాయకులు శేఖర్ పాత్రుడు,త్రినాధం,వెంకటనాయుడు,మధుసూదన్ రావు,సంతోషి,సర్పంచ్, కూటమి నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు

- వైయస్‌ఆర్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్
- వైయస్‌ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కోఆర్డినేషన్), పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శులు (కోఆర్డినేషన్), ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లతో పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ (రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోశా%, చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ) కార్యక్రమం జిల్లా స్థాయిలో గ్రాండ్ సక్సెస్
- ఇదే ఉత్సాహంతో ఈ కార్యక్రమం పూర్తిచేయాలి
- పార్టీ కమిటీల నియామకాలన్నీ కూడా వెంటనే పూర్తిచేయాలి

**తాడేపల్లి: జులై 06. పెన్ పవర్.** ఈ నెల 8 న దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైయస్‌ఆర్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. నిర్ణీత షెడ్యూల్‌లోగా బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం పూర్తిచేయాలని సూచించారు. ఆదివారం వైయస్‌ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కోఆర్డినేషన్), పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శులు (కోఆర్డినేషన్), ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లతో పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

**టెలికాన్ఫరెన్స్‌లో సజ్జల రామకృష్ణారెడ్డి ఏమన్నారంటే...**

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ (రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో.., చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ) కార్యక్రమం చాలా బాగా జరుగుతుంది, అన్ని జిల్లాల నుంచి మంచి స్పందన వచ్చింది. మన పార్టీ అధినేత జగన్ గారు కూడా పరిశీలించి చక్కగా జరుగుతున్నాయన్నారు. ఇదే ఊపుతో నియోజకవర్గం, మండలం, గ్రామస్థాయి వరకు వెళ్ళాలి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సమన్వయం చేసుకుంటూ అన్ని చోట్లా దిగ్విజయం చేయాలి. టీడీపీ వారు సుపరిపాలన తొలి అడుగు పేరుతో ప్రజల్లోకి వెళు తున్నామంటూ తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో మొక్కుబడిగా కార్యక్రమం చేస్తున్నారు తప్ప ప్రతి ఇంటికీ తిరిగే పరిస్థితి లేదు. మన ఇంటికి వస్తున్న టీడీపీ నాయకులను నిలదీయాలంటే మన కార్యక్రమం అనుకున్న షెడ్యూల్ ప్రకారం పూర్తి కావాలి. ప్రస్తుతం మనం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీ స్థాయిలో మన కార్యక్రమం జరుగుతుంది. ఆ తర్వాత మండలస్థాయిలో ఈ నెల 13 నుంచి 20 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి.

మనకు వస్తున్న ఫీడ్ బ్యాక్ ప్రకారం ఇప్పటివరకు మంచి ఫీడ్ బ్యాక్ వస్తుంది. ఇదే ఉత్సాహంతో ఈ కార్యక్రమం పూర్తిచేయాలి. అప్పుడే ప్రజల్లో చైతన్యం వస్తుంది. పార్టీ క్యాడర్‌కు కూడా మంచి సందేశం వెళుతుంది. మండల స్థాయి తర్వాత జులై 21 నుంచి ఆగష్టు 4 వరకు నాలుగో దశలో గ్రామస్థాయిలో జరుగుతుంది. ఈ లోపు కమిటీల నియామకాలు అన్నీ పూర్తి చేయాలి. అనుబంధ విభాగాలలో ప్రధాన విభాగాలు కూడా సమన్వయం చేసుకోవాలి. పార్టీలో చురుగ్గా పనిచేయాలనుకునే వారిని గుర్తించి వారికి కమిటీలలో అవకాశమివ్వాలి. పార్టీ కేంద్ర కార్యాలయం, సీనియర్ నాయకుల సహకారం అందుబాటులో ఉంటుంది. స్థానిక సంస్థలలో పదవుల్లో ఉన్న వారిని కూడా గుర్తించి పార్టీ కమిటీలలో ప్రాధాన్యమివ్వాలని నియోజకవర్గ నాయకులకు సూచిస్తున్నాం. గ్రామ కమిటీల నియామకం పూర్తవగానే బూత్ కమిటీలపై దృష్టి పెట్టాలి. అందరి డేటా, ప్రొఫైల్ అంతా కూడా సెంట్రల్ ఆఫీస్ నెట్‌వర్క్‌కు అనుసంధానించాలి. పార్టీ కార్యక్రమాలను సక్సెస్ చేయాలంటే అన్ని స్థాయిలలోని నాయకులు చిత్తశుద్దిగా పనిచేసినప్పుడే విజయవంతం అవుతాయి. గ్రామ కమిటీలు కూడా ఆగష్టులో పూర్తవ్వాలి. ఈ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం పూర్తవ్వాలి, జాప్యం జరగకూడదు. నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అందుబాటులో లేని కారణంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి సమన్వయం చేసి ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ నేతలకు సూచించారు.

ఈ నెల 8 న దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని మన వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతి ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తుంది. రాష్ట్రస్థాయి నుంచి జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయిలో అందరూ సమన్వయం చేసుకోవాలి. ప్రతి ఒక్కరి మధ్య సమన్వయంతో అన్ని అనుబంధ విభాగాలు కలిసి పనిచేసి జయంతి కార్యక్రమాలను, వివిధ సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్లాలన్నారు.

అనంతరం టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల స్థాయిలో చేపట్టే కార్యక్రమం కూడా షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయనున్నట్లు తెలిపారు. జిల్లాల స్థాయిలో మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. ఇదే ఉత్సాహంతో కార్యక్రమాన్ని పూర్తిచేస్తామని, జిల్లా స్థాయిలో మనం ఊహించిన దానికంటే మంచి స్పందన వస్తుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా నిర్ణీత కాల వ్యవధి లోనే పూర్తిచేస్తున్నామన్నారు. పార్టీ ఆదేశించిన షెడ్యూల్ ప్రకారం అన్నీ ప్రజల్లోకి తీసుకెళుతున్నాం. ప్రతి గడపకూ తీసుకెళతాం, టీడీపీ వాళ్ళు గడప గడపకు వెళ్ళలేకపోతున్నారు, ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీకి' వస్తున్న స్పందన టీడీపీ నాయకులకు చెమటలు పట్టిస్తుందన్నారు.

# కరేడులో బలవంతపు భూసేకరణ ఆపాలి

- పరిశ్రమల పేరుతో కుట్ర రాజకీయాలు చేయడం తగదు
- రైతులు, ప్రజలను ఇబ్బంది పెడితే వైయస్‌ఆర్‌సీపీ చూస్తూ ఊరుకోదు
- బాపట్ల జిల్లా వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున హెచ్చరిక
- ప్రజామోదంతో భూసేకరణ చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది
- అందుకే మా ప్రభుత్వం సేకరించిన భూమిని తన అనుకూల కంపెనీకి ఇవ్వాలని చూస్తున్నారు
- రూ.417 కోట్లు డబ్బులు కట్టి, పనులు మొదలు పెట్టిన ఇండోసోల్ కంపెనీని తరమేశారు
- కరేడు గ్రామంలో ఇండోసోల్‌కి భూ కేటాయింపులు చంద్రబాబు కుట్రలో భాగమే
- ఇండోసోల్‌ని అడ్డం పెట్టి వైయస్‌ఆర్‌సీపీ మీద బురదజల్లే ఆలోచనలో చంద్రబాబు
- స్పష్టం చేసిన మాజీ మంత్రి మేరుగు నాగార్జున
- తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మేరుగు నాగార్జున

**తాడేపల్లి:జులై 06. పెన్ పవర్.** కరేడులో బలవంతపు భూసేకరణ ఆపాలని బాపట్ల జిల్లా వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. పరిశ్రమల పేరుతో కుట్ర రాజకీయాలు చేయడం తగదని హెచ్చరించారు. రైతులు, ప్రజలను ఇబ్బంది పెడితే వైయస్‌ఆర్‌సీపీ చూస్తూ ఊరుకోదన్నారు. ఆదివారం మేరుగు నాగార్జున మీడియాతో మాట్లాడారు.

**పారిశ్రామికవేత్తలను భయపెట్టి తరిమేస్తున్నారు**

ఒకపక్క రాష్ట్రంలో అమలవుతున్న రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడి పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు భయపడుతుంటే చంద్రబాబు మాత్రం కమీషన్ల దాహంతో గతంలో వైయస్ జగన్ హయాంలో వచ్చిన పరిశ్రమలను తరిమేస్తున్నాడు. ప్రజామోదానికి వ్యతిరేకంగా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవాలని చూడటం దుర్మార్గం. దీనిని వైయస్‌ఆర్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. చంద్రబాబుకి చేతనైతే ప్రజలను ఒప్పించి వారి అంగీకారంతో భూములు సేకరించాలి తప్ప అనైతిక విధానాలను అవలంభిస్తూ బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం పూనుకుంటే వైయస్‌ఆర్‌సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. రైతుల పక్షాన నిలబడి వైయస్‌ఆర్‌సీపీ ఉద్యమిస్తుంది.

వేరే గ్రామాల్లో ఇండోసోల్ కంపెనీకి భూములిచ్చిన వైయస్ జగన్ చంద్రబాబు తన డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఆఖరుకి పారిశ్రామికవేత్తలను కూడా వదలడం లేదు. నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు పరిశ్రమల పేరుతో చంద్రబాబు ఆడుతున్న డ్రామాలే కారణం. వైయస్‌ఆర్‌సీపీ హయాంలో ఇండోసోల్ కంపెనీ 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకొస్తే రెండు జీవోల ద్వారా 5148 ఎకరాలు ఒకచోట, 3200 ఎకరాలు మరోచోట సేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రావూరు, చేవూరు గ్రామాల్లో 4,827 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ కూడా ఇవ్వడం జరిగింది. భూములిచ్చేందుకు రైతులు, ప్రజలు అంగీకారం కూడా తెలపడంతో ఇండోసోల్ కంపెనీ రూ.417 కోట్లు ప్రభుత్వానికి చెల్లించింది. పైలెట్ ప్రాజెక్టు కోసం కూడా నిర్మాణాలు ప్రారంభయ్యాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నట్టుండి ఇండోసోల్ కంపెనీ చేస్తున్న పనులు నిలుపుదల చేయించి వేరే ప్రాంతానికి మార్చాలని ఆదేశించింది. ఇందుకోసం కరేడులో 8వేల ఎకరాలు భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. స్థానిక రైతులు, ప్రజలు భూములిచ్చేది లేదని వారిస్తున్నా ప్రభుత్వం వినడం లేదు. ఒకవేళ బాధిత పక్షాల తరఫున వైయస్‌ఆర్‌సీపీ నిలబడి పోరాటం చేస్తే పరిశ్రమలకు వ్యతిరేక పార్టీగా ముద్ర వేయాలన్న కుట్రలకు చంద్రబాబు వ్యూహాలు రచిస్తున్నారు.

**కరేడులో భూసేకరణకు నోటిఫికేషన్ వెనుక భారీ కుట్ర.**

పరిశ్రమలు రావాలని, యువతకు ఉపాధి కావాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని నిజంగా చంద్రబాబు మనసులో ఉంటే, రైతులు, ప్రజల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగుతున్న పనులను ఎందుకు నిలుపుదల చేయిస్తున్నట్టు? సదరు కంపెనీ రూ.417 కోట్లు సైతం ప్రభుత్వానికి చెల్లించి ముందుకెళ్తుంటే అక్కడనుంచి తరలించే పేరుతో ఎందుకు అడ్డుకుంటున్నట్టు? రైతులంతా అంగీకారం తెలిపిన ప్రాంతంలో కాదని కరేడు గ్రామంలో 8 వేల ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వాల్సిన అవసరం ఎందుకొచ్చింది? రైతుల ఆమోదం లేకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా ఏకపక్షంగా నోటిఫికేషన్ ఎలా ఇచ్చారు? గత వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఇండో సోల్ కంపెనీకి కేటాయించిన భూమిని వేరే కంపెనీకి ఇవ్వాలని చూడటం భావ్యమేనా? మీకు అనుకూలమైన వేరే కంపెనీకి భూములు ఇవ్వాలనుకుంటే వేరే ప్రాంతంలో చూడాలే తప్ప ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి పనులు మొదలు పెట్టిన కంపెనీని తరిమేయడం భావ్యమేనా?

**ప్రజామోదంతో భూసేరణ చేసే సత్తా లేకనే..**

మీరు తీసుకు రావాలనుకున్న కంపెనీకి ప్రజామోదంతో భూములు సేకరించి ఇచ్చే సత్తా మీ ప్రభుత్వానికి లేదా? అంతేకానీ గత మా వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం మీద బురదజల్లే కుట్రతో ఇండోసోల్ కంపెనీని అడ్డంపెట్టి కరేడు గ్రామ రైతుల్లో భయాందోళన, అలజడి సృష్టించడం చాలా తప్పు. దీన్ని వైయస్‌ఆర్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. చంద్రబాబు తన రాజకీయాల కోసం రైతులు, పరిశ్రమలతో ఆడుకోవడం మానుకుంటే మంచిది. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలని, తద్వారా యువతకు ఉద్యోగవకాశాలు రావాలని ఆలోచన చంద్రబాబుకి ఉన్నట్టు కనిపించడం లేదు కాబట్టే ఇలాంటి కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నాడు. చంద్రబాబుకి నిజంగా పరిశ్రమలు తీసుకురావాలనే చిత్తశుద్ధి ఉంటే గతంలో వైయస్‌ఆర్‌సీపీ హయాంలో ప్రజామోదంతో సేకరించిన భూములను కాదని కొత్తగా కరేడులో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చేవాడే కాదు. ఇప్పటికైనా కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణకు ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలి.



# ప్రకాశం బ్యారేజిలో దూకి ప్రైవేట్ స్కూల్ డైరెక్టర్ ఆత్మహత్య..



**హైదరాబాద్ పెన్ పవర్:** సత్తెనపల్లికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ ఓనర్ ప్రకాశం బ్యారేజిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ( జులై 5 ) ఇంటి నుంచి కనిపించకుండా పోయిన భవిష్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీధర్ విజయవాడలోని ప్రకాశం బ్యారేజీలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులే శ్రీధర్ ఆత్మహత్యకు కారణమని భావిస్తున్నారు. పోలీసులు ప్రకాశం బ్యారేజిలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైనట్లు సమాచారం. ఈమేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు పోలీసులు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. శ్రీధర్ ఆత్మహత్యతో అతని కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన పట్ల శ్రీధర్ సన్నిహితులు, స్థానికులు దిగ్ర్భాంతి వ్యక్తం చేస్తున్నారు.

# జగన్ చిత్తూరు టూర్.. పోలీసులకు మరో సవాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో అధికార, విపక్షాల మధ్య ఎత్తులు పైఎత్తులతో రాజకీయం ఆసక్తికరంగా మారుతోంది. అయితే రెండు పార్టీల పోరులో పోలీసులు నలిగిపోతున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా మాజీ సీఎం జగన్ జిల్లాల పర్యటనలు పోలీసులకు పెను సవాల్ విసురుతున్నాయి. విపక్ష హోదా లేకపోయినా, మాజీ సీఎం హోదాలో జగన్ కు జడ్ ప్లస్ భద్రత కల్పిస్తున్నారు. అయితే తాను సీఎంగా ఉండగా, ఎంత మంది సిబ్బందితో భద్రత కల్పించారో, ఇప్పుడు కూడా అంతేమంది పోలీసులను నియమించాలని జగన్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తన మాస్ ఫాలోయింగు వల్ల సెక్యూరిటీ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రస్తుతం ఉన్న పోలీసులు జనాన్ని నియంత్రించలేకపోతున్నారని జగన్ వాదిస్తున్నారు. అందువల్ల సెక్యూరిటీని పెంచాలని పదే పదే ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అయితే నిబంధనల పేరుతో మాజీ సీఎం జగన్, వైసీపీ అభ్యర్థలను ప్రభుత్వం తిరస్కరిస్తోంది. కేంద్ర హోం శాఖ గైడ్ లైన్స్ ప్రకారం జడ్ ప్లస్ కేటగిరి కింద ఎంతమందితో భద్రత కల్పించాలో అంతేమందిని కేటాయిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇదే సమయంలో ఎన్నికల నిబంధనావళిని అతిక్రమించి గుంటూరు మిర్చియార్డుకు వెళ్లారని కొంతమందిని, మాజీ సీఎంకు ప్రాణ హాని లేదని మరికొందరిని తగ్గించిందని అంటున్నారు. దీంతో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తన భద్రతను నిర్లక్ష్యం చేస్తోందని మాజీ సీఎం తరుపున ఆయన పార్టీ న్యాయపోరాటం చేస్తోంది. ఇక గత నెలలో పల్నాడు జిల్లా పర్యటనలో చోటుచేసుకున్న అపశ్రుతులకు కూడా పోలీసులే కారణమంటూ వైసీపీ ఆరోపిస్తోంది. సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్ల గ్రామానికి జగన్ వెళ్తానంటే మూడు కార్లు వంద మందికి మాత్రమే అనుమతిస్తామని పోలీసులు చెప్పడం, పోలీసుల సూచనలను బేఖాతరు చేస్తూ జగన్ భారీ ర్యాలీగా పర్యటనకు వెళ్లడంతో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్ వ్యూహానికి కౌంటర్ గా నెల్లూరు పర్యటనకు వైసీపీ దరఖాస్తు చేస్తే అనుమతిచ్చినట్లే ఇచ్చి ర్యాలీకి అవకాశం లేకుండా ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. నెల్లూరు సెంట్రల్ జైలులో ములాఖత్ కోసం జగన్ పర్యటించాల్సివుండగా, సెంట్రల్ జైలుకు పది కిలోమీటర్ల దూరంలో హెలిపాడ్ ఏర్పాటుకు వైసీపీ దరఖాస్తు చేసింది. అయితే ప్రభుత్వం వ్యూహాత్మకంగా పావులు కదిపి సెంట్రల్ జైలు పక్కనే హెలిపాడ్ కు అనుమతిచ్చారు. దీంతో ర్యాలీకి అవకాశం లేకపోవడంతో జగన్ తన పర్యటనను వాయిదా వేసుకున్నారు.

ఇక ప్రభుత్వ వ్యూహానికి ప్రతివ్యూహంగా జగన్ ఎత్తుగడ వేశారు. తన పర్యటనకు ప్రభుత్వం తప్పనిసరిగా అంగీకరించేలా దరఖాస్తు చేయించారు. చిత్తూరులోని తోతాపురి మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండు చేస్తూ 9వ తేదీన పర్యటనకు దరఖాస్తు చేశారు. ఆ రోజు చిత్తూరు జిల్లాలో బంగారుపాళ్యం మార్కెట్ కమిటీకి మాజీ సీఎం వస్తున్నారని, దాదాపు 10 వేల మంది రైతులు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన అనుమతితోపాటు భద్రత చర్యలు తీసుకోవాలని వైసీపీ పోలీసులను కోరింది. దీంతో ప్రభుత్వం కోర్టులో బంతి వేసినట్లైంది. నెల్లూరు పర్యటనను వ్యూహాత్మకంగా అడ్డుకున్న టీడీపీ ప్రభుత్వం.. జగన్ చిత్తూరు టూర్ కు ఎలా చెక్ పెడుతుందా? అనే చర్చ ఆసక్తి రేపుతోంది. జగన్ చిత్తూరు టూరుపై పోలీసులు ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదని అంటున్నారు. కానీ, 10 వేల మందితో సభకు అనుమతి ఇవ్వాలనే వినతిని అంగీకరించే పరిస్థితి లేదంటున్నారు. అయితే వైసీపీ మాత్రం వ్యూహాత్మకంగానే పోలీసులను, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా దరఖాస్తు చేసిందని చెబుతున్నారు. అయితే హెలిపాడ్ ఎక్కడ పెట్టేది తేలకపోవడంతో జగన్ టూరుపై ఇంకా పోలీసులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదంటున్నారు. మొత్తానికి వైసీపీ వ్యూహాత్మకంగానే పోలీసులను సవాల్ చేసేలా వ్యవహరిస్తోందని అంటున్నారు.

# ఐటీ రంగంలో సంచలనం: ఇన్ఫోసిస్ ఉద్యోగులకు "హెచ్చరిక" ఈమెయిల్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ ఐటీ రంగంలో ప్రముఖ సంస్థ ఇన్ఫోసిస్ మరో కీలక నిర్ణయంతో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఐటీ ఉద్యోగులు అధిక పని ఒత్తిడితో సతమతమవుతున్న నేపథ్యంలో సంస్థ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలో ప్రతిపాదించిన "వారానికి 70 గంటల పని" సూత్రానికి భిన్నంగా, ఉద్యోగుల పని సమయాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టింది.

**నారాయణమూర్తి ప్రతిపాదన – వాస్తవ పరిస్థితి**

గతంలో నారాయణమూర్తి ఉద్యోగులు వారానికి 70 గంటలు అంటే రోజుకు సగటున 9.15 గంటలు మాత్రమే పని చేయాలని సూచించారు. అయితే, ఇన్ఫోసిస్ మానవ వనరుల విభాగం గుర్తించిన దాని ప్రకారం వాస్తవంలో చాలా తక్కువ మంది ఉద్యోగులు మాత్రమే ఈ మార్గదర్శకాలను పాటిస్తున్నారు. ముఖ్యంగా రిమోట్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ గంటలు పని చేస్తున్నట్లు తేలింది.

**ఓవర్‌టైమ్‌కు "వార్నింగ్" ఈమెయిల్స్**

ఈ సమస్యను పరిష్కరించడానికి, ఇన్ఫోసిస్ ఒక ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఉద్యోగులు రోజుకు 9.15 గంటలకు మించి పని చేస్తే, వారికి ఆటోమేటెడ్ హెచ్చరిక ఈమెయిల్స్ పంపబడతాయి. ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశ్యం ఉద్యోగులు తమ ఆరోగ్యంపై దృష్టి సారించేలా ప్రోత్సహించడమే.

**ఉద్యోగుల ఆరోగ్యానికి ప్రాధాన్యత**

ఎక్కువ సమయం పని చేయడం వల్ల ఉద్యోగుల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఇన్ఫోసిస్ గుర్తించింది. దీర్ఘకాలంలో సంస్థలో కొనసాగాలంటే, ఉద్యోగులు పని, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యతను పాటించడం అత్యవసరం అని %ఎ=% ఈమెయిల్స్ ద్వారా స్పష్టం చేసింది.

**3.23 లక్షల ఉద్యోగులపై ప్రభావం**

ఇన్ఫోసిస్ తీసుకున్న ఈ కొత్త నిర్ణయం సుమారు 3.23 లక్షల మంది ఉద్యోగులపై ప్రభావం చూపనుంది. సంస్థ ఉద్యోగుల నిబద్ధతను ప్రశంసిస్తూనే, వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

**ఉద్యోగ ప్రపంచంలో మారుతున్న ధోరణులు**

ఇన్ఫోసిస్ తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఆశిస్తున్నారు. భారత ఐటీ రంగంలో ఇది ఒక సానుకూల అడుగుగా భావించబడుతోంది. "ఉద్యోగుల ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు" అనే మంత్రాన్ని ఇన్ఫోసిస్ ముందుకు తీసుకెళ్తోంది. ఈ పరిణామం మిగతా ఐటీ సంస్థలకు కూడా ఒక మార్గదర్శకంగా నిలుస్తుందో లేదో వేచి చూడాలి.

# 'ఉచిత బస్సు.. అంత ఈజీ కాదు' కూటమికి పెద్ద సవాలే..



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం ఒకటి. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఈ పథకం ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా? అని అంతా ఎదురుచూస్తున్నారు. ఏడాదిగా అనేక అధ్యయనాలు చేసిన ప్రభుత్వం ఎట్టకేలకు ఉచిత బస్సు పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చేనెల 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలులోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే ఉచిత బస్సు పథకం కోసం ప్రభుత్వం ఏమైనా కొత్త చర్యలు తీసుకుంటున్నదా? లేదా? అనే విషయమే ఆసక్తిరేపుతోంది. ఉచిత బస్సు పథకం అమలు కోసం ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీల్లో ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు అవుతోంది. ప్రధానంగా కర్ణాటక, తెలంగాణల్లో ఉచిత బస్సు పథకంపై మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ఉచితం అనగానే అవసరం లేని ప్రయాణాలు అధికమవడంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. కర్ణాటకలో ఈ పథకం అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన ఓ ఎమ్మెల్యే ఉచిత బస్సు పథకంతో ఉపయోగం లేదని, రద్దు చేయడమే బెటరు అన్న ప్రకటన చేయడం ఆ మధ్య పెద్ద చర్చకు దారితీసింది. అయితే చెన్నై నగరంలో ఉచిత బస్సు వల్ల మహిళ ఆర్థిక స్వావలంబన పెరిగిందని కొన్ని సర్వేలు వెల్లడించాయి. దీంతో అన్నివిధాలుగా అధ్యయనం చేసిన ప్రభుత్వం ఏపీలో ఈ పథకాన్ని అమలు చేసే విధానంపై మార్గదర్శకాలు తయారు చేస్తోంది. ఇప్పటివరకు అధికారికంగా దీనిపై ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ కార్మిక సంఘాలు మాత్రం ఉచిత పథకం అమలు చేయడం కత్తిమీద సామేనంటూ ప్రకటనలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బస్సులు, సిబ్బందితో ఉచిత ప్రయాణం పథకం అమలు చేయడం ఆచరణ సాధ్యం కాదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో సగటున 40 నుంచి 45 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో మహిళా ప్రయాణికులు సగం మంది ఉంటారని ఓ అంచనా. అయితే ఉచిత పథకం అమలులోకి వస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య రెండు, మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. తెలంగాణ, కర్ణాటకల్లో ఉచిత ప్రయాణ పథకం వల్ల ఆక్యుపెన్సీ బాగా పెరిగిందని అధ్యయనాలు ఉన్నాయంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఏపీలో సమస్యల్లేకుండా ఉచిత బస్సు పథకం అమలు చేయాలంటే కొన్ని చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు సూచిస్తున్నాయి.

అదనంగా మూడు వేల బస్సులు, 10 వేల మంది సిబ్బందిని నియమించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రద్దీ డబుల్ అయ్యే అవకాశాలు ఉన్నందున సిబ్బందిపై భారం పెరగకూడదని, అదనపు ట్రిప్పులు వేయాల్సివుంటుందని అభిప్రాయపడుతున్నారు. అయితే ఆర్టీసీ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల వల్ల అదనపు బస్సులు, సిబ్బందిని నియమించే అవకాశాలుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కాలుష్యాన్ని అదుపు చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం కొత్తగా విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతోంది. కొద్దిరోజుల్లో రాష్ట్రానికి కొత్తగా 700 ఎలక్ట్రిక్ బస్సులు ఉన్నాయని అంటున్నారు. అయితే వీటిలో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారా? లేదా? అనేది కూడా తెలియడం లేదని అంటున్నారు. మొత్తానికి ఉచిత బస్సు పథకం అమలు చేయాలంటే ప్రభుత్వం కొత్త వనరులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందనే సూచనలు వస్తున్నాయి.

# ఖమేనీ కనిపించారోచ్.. ఇజ్రాయెల్, అమెరికా ప్రతీకారం తీర్చుకుంటాయా?



**హైదరాబాద్ పెన్ పవర్:** అణు చర్చలు విఫలం.. ఇజ్రాయెల్ తో సంఘర్షణ.. మరోవైపు స్వదేశంలో వ్యతిరేకత.. ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి.. ఇంకోవైపు అమెరికా–ఇజ్రాయెల్ ఎప్పుడు దాడి చేసి చంపేస్తాయో అన్న భయాందోళనలు.. దీంతో గుర్తుతెలియని ప్రదేశంలోకి వెళ్లిపోయారు ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీ. ఇరాన్ లో తిరుగులేని నాయకుడు అయిన ఆయనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిప్పులు చెరిగారు. ఖమేనీ ఏ కలుగులో దాక్కున్న సంగతీ తమకు తెలుసని.. ఆయన పని పడతామని హూకరించారు. కానీ, ఉద్రిక్తతలు చప్పున చల్లారడంతో ఖమేనీ బయటకు వచ్చారు. దాదాపు 20 రోజుల తర్వాత ఖమేనీ బహిరంగ ప్రపంచానికి కనిపించారు. ఇరాన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో ఇరాన్ ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా భీకర దాడులు చేసిన నష్టం గురించి కథనాలు వస్తున్న వేళ.. ఇరాన్ మళ్లీ పుంజుకుంటుందనే అంచనాల మధ్య... ఖమేనీ ఉనికి చాటుకోవడం చర్చనీయమైంది. శనివారం మొహర్రం.. దీంతో ఇరాన్ రాజధాని టెహ్రాన్ లో జరిగిన మతపరమైన కార్యక్రమానికి ఖమేనీ హాజరయ్యారు. ఇరాన్ షియా దేశం అనే సంగతి తెలిసిందే. బలిదానానికి గుర్తుగా షియా ముస్లింలు మొహర్రం జరుపుకొంటారు. పండుగ నేపథ్యంలోనే ఖమేనీ బయటకు వచ్చారు. షియా ముస్లింలకు మొహర్రం చాలా ముఖ్యమైనది. ఈ సందర్భంగా సంతాప దినాలు నిర్వహిస్తారు. వీటిలోనే ఖమేనీ కనిపించారు. మొహర్రం జరుపుకొంటున్న హాలులోకి ఖమేనీ ప్రవేశిస్తున్న ఫొటోలను ఇరాన్ స్టేట్ టీవీ మీడియాకు విడుదల చేసింది. షియా ప్రాబల్య ఇరాన్ లో మొహర్రం కార్యక్రమాలకు ఖమేనీ తప్పక హాజరవుతారు. సంప్రదాయ నల్ల దుస్తులు ధరించి పాల్గొంటారు. దీంతో ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. గత నెల 14 ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం మొదలైంది. ఆ వెంటనే ఖమేనీ గుర్తుతెలియని ప్రదేశానికి వెళ్లిపోయారు. కేవలం వాయిస్ రికార్డులను బయటకు విడుదల చేశారు. మరిప్పుడు ఇజ్రాయెల్–అమెరికా ఎలా స్పందిస్తాయో చూడాలి.

# కేరళకు చేరుకున్న బ్రిటీష్ ఇంజినీర్లు.. యూకే F-35 ప్యాకప్

**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన ఎఫ్–35బీ (%ఖీ–35దీ%) యుద్ధ విమానం కేరళలోని తిరువనంతపురం విమా నాశ్రయంలో సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ విమానానికి మరమ్మతులు చేసి, తిరిగి తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఫైటర్ జెట్ మరమ్మతు పనులను చేపట్టేందుకు యూకే నుంచి 24 మంది ఏవియేషన్ ఇంజినీర్ల బృందం ప్రత్యేక పరికరాలతో ఆదివారం రాయల్ ఎయిర్ ఫోర్స్ A400M విమానంలో కేరళకు చేరుకుంది. దీంతో విమానాన్ని మరమ్మత్తుల కోసం హ్యాంగర్‌కు తరలించారు. రానున్న రోజుల్లో దీన్ని సీ–17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానంలో తరలించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బ్రిటీష్ హైకమిషన్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.., అవసరమైన అన్ని మరమ్మతులు, భద్రతా తనిఖీల తర్వాత విమానం తిరిగి సేవలను ప్రారంభిస్తుంది. దీనివల్ల ఇతర విమానాల షెడ్యూల్ నిర్వహణకు ఎటువంటి అంతరాయం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తిరువనంతపురం విమానాశ్రయంలో ఉన్న ఎఫ్–35బీ ఫైటర్ జెట్‌కు భారీ భద్రత కల్పించామని, సాయుధ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (CISF) సిబ్బంది కాపలాగా ఉన్నారని అధికారులు వెల్లడించారు.



గత నెల ఇండో–యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్–35బీ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో జూన్ 14న అర్ధరాత్రి దాటిన తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో దీన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరతతో అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చినా, ఆ తర్వాత యూకే అధికారులు ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య ఉందని స్పష్టం చేశారు. దీనికి మరమ్మతులు చేయడానికి అదే రోజు రాత్రి ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. మరమ్మతులు చేసినా విమానం తిరిగి పనిచేయకపోవడంతో అప్పటి నుంచి ఈ ఫైటర్ జెట్ ఎయిర్‌పోర్టులోనే ఉంది.

## ఇంగ్లాండ్‌కు ఆకాశ్ దీప్ డబుల్ స్ట్రోక్.. 92 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన స్టోక్స్ సేన



**హైదరాబాద్ పెన్ పవర్:** బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతోన్న రెండో టెస్టులో టీమిండియా విజయం దిశగా దూసుకుపోతుంది. 608 పరుగుల భారీ లక్ష ఛేదనకు దిగిన ఇంగ్లాండ్ 92 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతూ కష్టాల్లో పడింది. వర్షం కారణంగా రెండో టెస్ట్ చివరి రోజు (ఆదివారం) మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. వర్షం కారణంగా ఐదో రోజు ఆటను 80 ఓవర్లకు కుదించారు మ్యాచ్ అఫిషియల్స్. ఓవర్ నైట్ స్కోర్ 77/3తో ఐదు రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది.

వర్షం పడటంతో పిచ్ బౌలర్లకు సహకరించడంతో టీమిండియా బౌలర్ ఆకాష్ దీప్ చెలరేగిపోయాడు. వరుస ఓవర్లలో వికెట్లు తీసి ఇంగ్లాండ్?ను ఒత్తిడిలోకి నెట్టాడు. క్రీజులో పాతుకుపోయేందుకు ప్రయత్నిస్తోన్న ఓలీ పోప్‌ను 19 ఓవర్ తొలి బంతికే ఔట్ చేశాడు ఆకాష్ దీప్. అద్భుతమైన బంతితో ఓలీ పోప్?ను క్లీన్ బౌల్డ్ చేశాడు. తన తర్వాతి ఓవర్లో మరో వికెట్ తీశాడు ఆకాష్ దీప్. ఫస్ట్ ఇన్నింగ్స్ సెంచరీ హీరో హ్యారీ బ్రూక్?ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో 23 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. వరుస ఓవర్లలో రెండు వికెట్లు తీసి ఇంగ్లాండ్?కు డబుల్ స్ట్రోక్ ఇచ్చాడు ఆకాష్ దీప్. ఇంగ్లాండ్ ప్రస్తుతం 5 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. క్రీజులో ఇంగ్లాండ్ రెడ్ బాల్ కెప్టెన్ బెన్ స్టోక్స్ (10), స్మిత్ (18) ఉన్నారు. రెండో టెస్టులో విజయానికి ఇండియాకు ఇంకో 5 వికెట్లు అవసరం కాగా.. అతిథ్య జట్టు 497 రన్స్ చేయాలి. టీమిండియా బౌలర్లు మంచి స్వింగ్?లో ఉండటంతో ఇండియా విజయాన్ని అడ్డుకోవడం ఇంగ్లాండ్?కు దాదాపు కష్టమే.

## గిల్ నాకు స్ఫూర్తి.. డబుల్ సెంచరీ కొడతా: వైభవ్ సూర్యవంశీ



**హైదరాబాద్ పెన్ పవర్:** 14 ఏళ్లకే ఐపీఎల్‌లోకి అడుగు పెట్టి సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ అదే ఫామ్‌ను ఇప్పుడు ఇంగ్లాండ్‌లోనూ కొనసాగిస్తున్నాడు. అండర్ -19 జట్టు తరపున ఆడుతున్న వైభవ్ ఇంగ్లాండ్‌పై రికార్డు సెంచరీ నమోదు చేశాడు. కేవలం 78 బంతుల్లోనే 143 పరుగులు చేశాడు. అయితే, త్వరలోనే డబుల్ సెంచరీ కొడతానని నమ్మకంగా చెబుతున్నాడు. ఈ విషయంలో తనకు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్ఫూర్తి అని వైభవ్ తెలిపాడు. "నేను రికార్డు సెంచరీ కొట్టానని అప్పటికి నాకు తెలియదు. మా జట్టు టీమ్ మేనేజర్ అంకిత్ సర్ వచ్చి ఈ విషయం చెప్పారు. 'నువ్వు యూత్ వన్డేల్లో రికార్డు క్రియేట్ చేశావు. కంగ్రాట్స్' అని అన్నప్పుడే తెలిసింది. అయితే త్వరలోనే డబుల్ సెంచరీ కూడా కొట్టేందుకు ప్రయత్నిస్తా. ఈ విషయంలో నాకు గిల్ స్ఫూర్తి. అతడి ఆటను చూశా. శతకం, ద్విశతకం తర్వాత కూడా ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూనే ఉంటాడు. జట్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఆలోచిస్తుంటాడు. డబుల్ సెంచరీపై నా మైండ్‌లోనూ ఆలోచనలు తిరుగుతూనే ఉంటాయి. నేను సెంచరీ చేశాక 20 ఓవర్లు ఉన్నాయి. దానిని ద్విశతకంగా మారిస్తే బాగుండేది. నేను వందశాతం కాన్ఫిడెంట్‌గా కొట్టిన షాట్ కాదు. అందుకే, ఔటయ్యా. లేకపోతే నేను కూడా గిల్ మాదిరిగా డబుల్ సెంచరీ పూర్తి చేసేవాడిని. ఈ రికార్డు అనంతరం ప్రతి ఒక్కరూ అభినందించడం బాగుంది. అయితే, ఎలాంటి సంబరాలు చేసుకోలేదు. జట్టు విజయం కోసం రాణించడం ఆనందంగా ఉంది. నా కుటుంబ సభ్యులతో మాట్లాడా. తప్పకుండా వచ్చే మ్యాచ్‌లో 200 కొట్టేందుకు ప్రయత్నిస్తా. చివరి ఓవర్ వరకూ క్రీజ్‌లో ఉండేందుకూ ప్రయత్నించి జట్టుకు మరిన్ని పరుగులు అందించేందుకు శ్రమిస్తా" అని వైభవ్ వెల్లడించాడు.

# ధోని.. ఓ జెర్సీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య టెస్టుకు ఓ ఇంగ్లిష్ వలంటీర్ టీమ్‌ఇండియా జెర్సీని తీసుకొచ్చాడు. చాలా ప్రత్యేకంగా అందరికీ చూపిస్తూ ఆనందం పొందాడు. గత పదేళ్ల నుంచి అక్కడ ఎప్పుడు మ్యాచ్ జరిగినా అతడు అలానే చేస్తున్నాడు. ఏంటా జెర్సీ ప్రత్యేకత అంటారా? అతడి సేవలకు మెచ్చి భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని దాన్ని బహూకరించాడు. 2014లో టీమ్‌ఇండియా.. ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు అప్పటి జట్టు కెప్టెన్‌గా ఉన్న ధోని.. ఇంగ్లాండ్ క్రికెట్ వలంటీర్ ఆండ్రూ సైమ్స్‌కు పుట్టిన రోజు కానుకగా ప్రత్యేకంగా ఆ జెర్సీని పంపించాడు. ఈ సంఘటన జరిగి పదేళ్లు దాటినా సైమ్స్ మాత్రం ధోని కానుకను మర్చిపోలేదు.

"ధోని నుంచి అందిన ప్రత్యేక కానుక అది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన వన్డే సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్ దగ్గరకు నన్ను పిలిచి ఆ జెర్సీని అందజేశాడు. కానీ అందుకు కారణం అంతకుముందు నాటింగ్‌హామ్‌లో జరిగిన వన్డే. వర్షం కారణంగా నాటింగ్‌హామ్‌లో ఆట సాధ్యం కాలేదు. మైదానం నీటితో నిండిపోయింది. భారత ఆటగాళ్లకు ఆహార ఏర్పాట్ల బాధ్యత మాకు అప్పగించారు. ఈ సందర్భంగా ఒక బీసీసీఐ అధికారి ద్వారా త్వరలోనే నా 50వ పుట్టిన రోజు వస్తుందని ధోని తెలుసుకున్నాడు. బర్మింగ్‌హామ్‌లో జరిగిన తర్వాతి వన్డేలో నన్ను పిలిచి జెర్సీ అందజేశాడు" అని సైమ్స్ గుర్తు చేసుకున్నాడు.

# ఉర్ఫీ జావెద్ ని టాలీవుడ్ కి తెస్తున్నారా?



మానస చౌదరి బోల్డ్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో స్టన్ చేసింది



ఉర్ఫీ జావెద్ పరిచయం అవసరంలేని పేరు. బాలీవుడ్ లో సినిమాలు చేయలేదు. కానీ సోషల్ మీడియాలో ఎంతో ఫేమస్ . బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ని మించిన ఫాలోయింగ్ ఉర్ఫీ సొంతం అనడంలో ఎలాంటి సందేహం లేదు. వింతైన డిజైనర్ దుస్తుల్లో అందాల ప్రదర్శనలో తానో సంచలనం. డిజైనర్ దుస్తుల్లో రొడ్డెక్కిందంటే? అక్కడ ట్రాఫిక్ జామ్ అవ్వాల్సిందే. ఇన్ స్టా హీటెక్కాల్సిందే. డ్యాష్ అండ్ డేరింగ్ గాళ్. తనదారికి అడ్డొస్తే సెలబ్రిటీలనే ఎదురిస్తుంది. నువ్వెంత అంటే నువ్వెంత అంటుంది. ఇలాంటి వివాదాలు అమ్మడి పేరిట చాలానే ఉన్నాయి. శిల్పా శెట్టి భర్త రాజ్ కుంద్రా తో కూడా తగాదాకి దిగిన సంగతి తెలిసిందే. ఇలా ఇంత ఫేమస్ అయినా అమ్మడికి బాలీవుడ్ లో మాత్రం ఇప్పటికీ అవకాశాలు రాలేదు. కొన్ని టీవీ షోలు..వెబ్ సిరీస్ లు చేసింది. సినిమా ఛాన్సలు మాత్రం రాలేదు. ఈ నేపథ్యంలో ఉర్ఫీ ని టాలీవుడ్ కి తీసుకొచ్చే బాధ్యతను ఓ దర్శక, నిర్మాత తీసుకున్నాడుట. ఉర్ఫీని హీరోయిన్ గా పెట్టి సినిమా తీస్తే ఎలా ఉంటుంది? అన్న ఆలోచనతో ముంబై వైపు మళ్లినట్లు సమాచారం.

ఆ దర్శక, నిర్మాత వెనుక మరో దర్శకుడి హస్తం కూడా ఉందిట. సోషల్ మీడియాలో ఉర్ఫీ ఫాలోయింగ్ చూసే ఈ ఛాన్స్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరి ఉర్ఫీని ఎలాంటి పాత్రలో చూపిస్తారో చూడాలి. ఉర్ఫీ కూడా అందాల ప్రదర్శనకు ఏమాత్రం వెనకడుగు వేయదు. ఆఫ్ ది స్క్రీన్ లో నే చిచ్చర పిడుగులా చెలరేగిన బ్యూటీ ఆన్ ది స్క్రీన్ పై ఆగుతుందా? ఆ దర్శక , నిర్మాతలిద్దరు కూడా హీరోయి న్లను అందంగా చూపించడంలో ఎక్స్ పర్ట్ లే. గతంలో కొన్ని బోల్డ్ అటెంప్ట్ లు చేసిన అనుభవం కూడా ఉంది. ఉర్ఫీ ఇమేజ్ కూడా ఈ నయా డైరెక్టర్లకు బాగానే వర్కౌట్ అవుతుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో? తేలాలి. అలాగే ఈ అవకాశం నిజమే అయితే? ఉర్ఫీ జావెద్ రియాక్షన్ ఎలా ఉంటుంది? అన్నది అంతే ఆసక్తికరం.



ఆశు రెడ్డి బోల్డ్ న్యూ లుక్‌లో గ్లామ్ కోటియన్‌గా మారి పోయింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com